Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 263 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 అక్టోబర్ 2023 గురువారం పేజీలు : 4

## కులగణన అంటే ఎక్స్‌రే

న్యూఢిల్లీ : కులాలవారీగా జనాభా లెక్కింపు.. దేశాన్ని ఎక్స్‌రే తీయడం వంటిదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. 'గాయపడిన' ఓబీసీలు, దళితులు, గిరిజనుల స్థితిగతుల ను కులగణన వెలుగులోకి తీసుకొస్తుందని తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని శహడోల్ జిల్లా బ్యోహారీలో జరిగిన ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. ఏది ఏమైనా.. అసలు నిజాలు తెలుసుకునేందుకు కులగణన జరిపేలా కేంద్రప్రభుత్వంపై కాంగ్రెస్ ఒత్తిడి తెచ్చి తీరుతుందన్నారు. ప్రధాని మోదీ ఈ అంశంపై ఎందుకు మాట్లాడ రని నిలదీశారు. కాంగ్రెస్ చేపట్టిన కులగణన డేటా బయటపెట్టా లని ఆయన్ను సవాల్ చేశామని.. ఆయన దాని గురించి మాట్లాడకుండా ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ గురించి మాట్లాడతారని ఎద్దేవాచేశారు.



# హెూరాహెూరీ

## సిద్ధమవుతున్న పార్టీలు

## గెలుపు తమదంటే తమదంటూ ధీమా!

హైదరాబాద్: ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ పార్టీలు హెూరాహెూరీ పోరుకు సిద్ధమవుతున్నాయి. నవంబరు 30న పోలింగ్ జరగనుండటంతో రానున్న యాభై రోజులు వాటికి కీలకం కానున్నాయి. చాలా ముందుగానే అభ్యర్థులను ప్రకటించిన భారాస ప్రచారంలో ముందుండగా... కాంగ్రెస్, భాజపాలూ జోరు పెంచాయి. గత తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధితోపాటు పెండింగ్‌లో ఉన్న వివిధ అంశాలను పరిష్కరించిన భారాస హ్యాట్రిక్ గ్యారంటీ అన్న ధీమాను వ్యక్తంచేస్తోంది. ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ప్రజలకు తమపై నమ్మకం పెరిగిందని, ఓటర్లు ఆశీర్వదిస్తారని కాంగ్రెస్ స్పష్టంచేస్తోంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తర్వాత కొంత స్తబ్దుగా ఉన్న భాజపా ఇటీవల మళ్లీ జోరు పెంచింది. గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన పసుపు బోర్డుతోపాటు తెలంగాణ ప్రభుత్వం కోరినట్లుగా కృష్ణా జలాల పంపిణీ పునఃసమీక్షకు నిర్ణయం తీసుకుంది. దాంతో పరిస్థితి తమకు అనుకూలంగా ఉంటుందని పేర్కొంటోంది.

**సభలు, శంకుస్థాపనలతో భారాస జోరు :** ఒకేసారి 115 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్ సిట్టింగ్ ఎమ్మెల్యేలలో ఆరుగురికి మినహా మిగిలిన అందరికీ టికెట్లు ఇచ్చారు. రకరకాల కార్యక్రమాల పేరుతో అభ్యర్థులను పూర్తిస్థాయిలో ప్రచారంలోకి దింపడంతోపాటు, పలుచోట్ల నాయకుల్లో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చే ప్రయత్నం చేశారు. నాలుగైదు చోట్ల తప్ప మిగిలిన నియోజకవర్గాల్లో ఎలాంటి సమస్యలు లేవని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు విస్తృతంగా పర్యటిస్తున్నారు. రోజుకు రెండు, మూడు నియోజకవర్గాల్లో వీరిద్దరూ సుడిగాలి పర్యటనలు చేసి బహిరంగసభలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు ఇలా అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రచారంలోనూ, అన్నివర్గాలు తమకు మద్దతు ఇచ్చేలా చూసుకోవడానికి అవసరమైన చర్యల్లో భారాస ముందుంది. షెడ్యూలు రాకముందే ఒక విడత ప్రచారాన్ని పూర్తి చేసింది. అభ్యర్థులంతా నెలరోజులుగా పూర్తిగా నియోజకవర్గాల్లోనే తిరుగుతున్నారు. మరోవైపు కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆయా కార్యక్రమాలకు దూరంగా ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్... షెడ్యూలు వచ్చిన నేపథ్యంలో ఈ నెల 15 నుంచి వరుసగా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు.

**ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ ఆశలు :** కర్ణాటక ఎన్నికల్లో విజయంతో కాంగ్రెస్‌లో ఉత్సాహం నెలకొంది. మూడు నెలలుగా దూకుడుగా ఉంటూ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. తొమ్మిదేళ్లపాటు అధికారంలో ఉన్న భారాసపై ప్రజల్లో అసంతృప్తి ఉందని, అది తమకు ఉపయోగపడుతుందని ఆ పార్టీ భావిస్తోంది. హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాలను నిర్వహించింది. అదే సమయంలో నిర్వహించిన భారీ బహిరంగసభలో సోనియాగాంధీతో ఆరు గ్యారంటీలను ప్రకటింపజేసింది. రైతులు, మహిళలు, కార్మికులు, యువత, విద్యార్థులు ఇలా వివిధ వర్గాలకు ప్రయోజనం కలిగించేలా ఉన్న ఈ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. అగ్ర నాయకులంతా టికెట్ల ఖరారు ప్రక్రియలో నిమగ్నం కావడంతో అనుకున్నట్లుగా ప్రచారం జరగడంలేదన్న అభిప్రాయముంది. షెడ్యూలుకు ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలనుకొన్నా ఆ కసరత్తు ఇంకా కొలిక్కి రాలేదు. పలు నియోజకవర్గాల్లో ఇప్పటివరకు ప్రచారం చేసుకొన్నవారు కాకుండా... కొత్త అభ్యర్థుల పేర్లు తెరపైకి వస్తున్నాయి. టికెట్ల కేటాయింపు తేలక పలుచోట్ల ఇంకా ప్రచారమే మొదలవలేదు. అయితే గతంలో 60-70 చోట్ల మాత్రమే బలమైన అభ్యర్థులుండేవారని, ఇతర పార్టీల నుంచి బలమైన నాయకులు చేరుతుండటంతో ప్రస్తుతం 90కి పైగా నియోజకవర్గాల్లో గట్టిపోటీ ఇచ్చే పరిస్థితి వచ్చిందని, అధికార పార్టీపైన ప్రజల్లో ఉన్న అసంతృప్తి తమకు లాభిస్తుందన్న ధీమాను కాంగ్రెస్ నాయకులు వ్యక్తంచేస్తున్నారు.

**ప్రధాని సభలతో వేగం పెంచిన భాజపా :** కర్ణాటక ఎన్నికలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు తర్వాత భాజపాలో కొంత స్తబ్దత నెలకొన్నా నెలరోజులుగా వేగం పెరిగింది. మహబూబ్‌నగర్, నిజామాబాద్‌లలో ప్రధాని మోదీతో బహిరంగసభలు నిర్వహించింది.

వెంటనే రాష్ట్రస్థాయి సమావేశానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అంతకుముందు కూడా భాజపా పాలిత రాష్ట్రాల్లోని 119 మంది ఎమ్మెల్యేలను తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలో పర్యటింపజేసి, పార్టీ పరిస్థితిపై నివేదికలు తెప్పించారు. అదేసమయంలో కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కొన్ని రోజులుగా రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం తెలంగాణలో రూ.9 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అనేక పథకాలు ప్రారంభించిందని గట్టిగా ప్రచారం చేస్తున్నారు.

**2018లో భారాసకు 47% ఓట్లు :** గత అసెంబ్లీ ఎన్నికల్లో 47% ఓట్లతో 88 స్థానాలను గెలుచుకొని భారాస ఘన విజయం సాధించింది. 28% ఓట్లతో కాంగ్రెస్ 19 స్థానాలను, 7% ఓట్లతో భాజపా ఒకచోట, 4% ఓట్లతో తెదేపా రెండుచోట్ల, 3% ఓట్లతో ఎంఐఎం ఏడు స్థానాల్లో గెలుపొందాయి. అనంతర పరిణామాల్లో కాంగ్రెస్ నుంచి 12 మంది భారాసలో చేరగా, ఒకరు రాజీనామా చేసి భాజపాలో చేరి, ఉప ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంపీగా గెలిచాక ఎమ్మెల్యేగా రాజీనామా చేయడంతో ఆ స్థానంలోనూ భారాసనే గెలిచింది. ఇండిపెండెంట్లుగా గెలిచిన ఇద్దరితోపాటు తెలుగుదేశం నుంచి గెలిచిన ఇద్దరు కూడా అధికార పార్టీలో చేరారు. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో భాజపా గెలుపొందింది. ప్రస్తుతం అసెంబ్లీలో అధికార భారాసకు 104 మంది ఎమ్మెల్యేలు, ఎంఐఎంకు ఏడుగురు, కాంగ్రెస్‌కు ఐదుగురు, భాజపాకు ముగ్గురు ఉన్నారు.

## డిసెంబర్ సెంటిమెంట్ : కాంగ్రెస్ బీయారెస్ లలో ఎవరికి లక్ ?

హైదరాబాద్ : తెలంగాణాలో నవంబర్ 30న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం డేట్ ఫిక్స్ చేసింది. ఇప్పటికి చూస్తే సరిగ్గా 50 రోజులు మత్రమే గడువు ఉంది. ఈ యాభై రోజులూ తెలంగాణాలోని అన్ని రాజకీయ పార్టీలకూ అగ్ని పరీక్షగానే ఉంటాయనడంలో అతిశయోక్తి లేదు. తెలంగాణాలో రెండు సార్లు బీయారెస్ అధికారంలో ఉంది. మూడవసారి గెలుస్తామని అంటోంది. సెంటిమెంట్లు అన్నీ తమకు అనుకూలం అని బీయారెస్ చెబుతోంది. 2018లో డిసెంబర్ 7న ఎన్నికలు జరిగాయి. 11న కౌంటింగ్ జరిగింది. దాదాపుగా తొంబై సీట్లకు చేరువలో బీయారెస్ గెలుచుకుని రెండవసారి అధికారం సొంతం చేసుకుంది. మరి ఈసారి అలా జరుగుతుందా అన్నది ఒక చర్చగా ఉంది. నవంబర్ 30న ఎన్నికలు ఉన్నాయి. డిసెంబర్ 3న ఫలితాలు వస్తున్నాయి. అంటే డిసెంబర్ సెంటిమెంట్ తమదే అని బీయారెస్ అంటోంది. మరి కాంగ్రెస్ వైపు నుంచి చూస్తే తమకే డిసెంబర్ సెంటిమెంట్ అనుకూలం అంటోంది. తాము తప్పక గెలిచి తీరుతామని అంటోంది. ఇంతకీ కాంగ్రెస్ డిసెంబర్ సెంటిమెంట్ ఎలా అంటే 1989లో ఉమ్మడి ఏపీకి




ఎన్నికలు డిసెంబర్ 2న జరిగాయి. అప్పట్లో అప్రతిహతంగా వెలుగుతున్న తెలుగుదేశం పార్టీని ఎన్టీయార్ ని కాంగ్రెస్ ఓడించి మొత్తం 294 సీట్లకు గానూ 181 సీట్లను గెలుచుకుని అధికారం హస్తగతం చేసుకుంది. తిరిగి 1994 డిసెంబర్ లో ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ ఓడింది. 1999లో చూసుకుంటే నవంబర్ లో ఉమ్మడి ఏపీకి ఎన్నికలు జరిగాయి. చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ గెలిచింది. ఇక 2004, 2009లలో మే నెలలోనే ఉమ్మడి ఏపీలో ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ గెలిచింది. దీనికంటే ముందు 1983 జనవరిలో, 1985 మార్చిలో ఎన్నికలు ఉమ్మడి ఏపీలో జరిగితే కాంగ్రెస్ ఓడింది. టీడీపీ గెలిచింది. అలా చూసుకుంటే డిసెంబర్ లో ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ ఒక్కసారి మాత్రమే గెలిచింది అని చరిత్ర చెబుతోంది. 1983కి ముందు కాంగ్రెస్ ఒక్కటే ఉమ్మడి ఏపీని ఏలింది కాబట్టి ఓటమి కూడా ఎదురుకాలేదు మరి బీయారెస్ విషయం తీసుకుంటే 2014లో మేలో ఎన్నికలు జరిగితే తొలిసారి గెలిచింది. 2018 డిసెంబర్ లో రెండవసారి గెలిచింది. అలా రెండు పార్టీలకు డిసెంబర్ సెంటిమెంట్ ఉందంటే ఉంది. మరి ఈ సెంటిమెంట్ లో ఎవరు ఈసారి విజేత అవుతారు అన్నదే చూడాలి. ఇక బీజేపీ అయితే ఈ సెంటిమెంట్లు కంటే మాకు ప్రజల మద్దతు చాలా ఉంది కాబట్టి గెలిచేస్తామని అంటోంది. సో డిసెంబర్ 3న వచ్చే ఫలితాలు ఎవరికి లక్ అన్నది అత్యంత ఆసక్తికరంగా ఉన్నాయనే భావించాల్సి ఉంది.




## తెలంగాణ తెచ్చుకుంది ప్రజల కోసం.. దొరల కోసం కాదు..

ఖమ్మం జిల్లా: తెలంగాణ ప్రజలు దోపిడీ ప్రభుత్వంను వదిలించుకొని ఇందిరా పాలన కోసం ఎదురు చూస్తున్నారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఖమ్మం జిల్లా అనంతసాగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుని ప్రభుత్వంను ఏర్పాటు చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని.. తెలంగాణ రాష్ట్రం తెచ్చుకుంది ప్రజల కోసమని.. దొరల కోసం కాదని అన్నారు. బీఆర్ఎస్ కు ఓటు వేయడమంటే బీజేపీకి ఓటు వేసినట్లేనని, బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని ఆయన ఆరోపించారు. ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని భట్టి విక్రమార్క ఆశాభావం వ్యక్తం చేశారు.




# 50 మందితో తొలి జాబితా

## బండి సంజయ్ కరీంనగర్ బరిలో!
## కోరుట్ల ఎమ్మెల్యేగా అర్వింద్ పోటీ?
## మెదక్ అసెంబ్లీ బరిలో విజయశాంతి
## 15 లేదా 16న ప్రకటించే అవకాశం

## ప్రకటనకు సిద్ధమవుతున్న కమలనాథులు

హైదరాబాద్ : తెలంగాణ శాసన సభకు పోటీ చేయబోయే బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాను ఈ నెల 16న ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను పలు సెగ్మెంట్లలో బరిలో నిలిచే కమలనాథుల ఎంపికకు సంబంధించి ఇప్పటికే పార్టీ నాయకత్వం కసరత్తును ముమ్మరం చేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎన్నికల కమిటీ అధ్యక్షుడు ప్రకాశ్ జావడేకర్.. రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్‌లు సునీల్ బన్సల్, తరుణ్ ఛుగ్.. ఎంపీలు లక్ష్మణ్, బండి సంజయ్.. ఎన్నికల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్ జాబితాపై చర్చించారు.

దాదాపు 90 సెగ్మెంట్ల జాబితాపై చర్చించగా, ఇందులో, సుమారు 50 నియోజకవర్గాలకు సంబంధించి స్పష్టత వచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ జాబితాను 15 లేదా 16న ప్రకటించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో సీనియర్ నేతలంతా పోటీ చేయాల్సిందే అని బీజేపీ జాతీయ నాయకత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపురావు, పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యు డు డాక్టర్ కె.లక్ష్మణ్‌లు బరిలోకి దిగక తప్పని పరిస్థితి ఏర్పడింది. బండి సంజయ్ కరీంనగర్ నుంచి పోటీ చేస్తారు. ధర్మపురి అర్వింద్ కోరుట్ల నుంచి బరిలో దిగే అవకాశం ఉంది. డాక్టర్ లక్ష్మణ్ రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన బదులు పార్టీ సీనియర్ నేత బండారు దత్తాత్రేయ కుమార్తె విజయలక్ష్మి పేరు పరిశీలనలో ఉంది. ఈమెతో పాటు ప్రదీప్ కుమార్ కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు తనయుడు బరిలోకి దిగనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి. విజయశాంతిని మెదక్ నుంచి పోటీ చేయించే ప్రతిపాదన పార్టీ జాతీయ నాయకత్వం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

**పరిశీలనలో ఉన్న ఆశావహుల జాబితా..** సిర్‌పూర్ : పాల్వాయి హరీశ్‌బీ ఆసిఫాబాద్ : ఆత్మారావు నాయక్, కోట్నాక్ విజయ్, చెన్నూరు : వివేక్‌బీ బెల్లంపల్లి : శ్రీదేవిబీ మంచిర్యాల : రఘునాథరావు, ఆదిలాబాద్ : పాయల శంకర్, సుహాసినిరెడ్డిబీ బోథ్ : సోయం వెంకటేశ్వర్లు, సాకేటి దశరథ్, నిర్మల్ : మహేశ్వర్‌రెడ్డిబీ,ముథోల్: డాక్టర్ రమాదేవి, రామారావు పాటిల్‌బీ ఖానాపూర్ : రమేశ్ రాథోడ్‌బీ బాన్సువాడ : మల్యాద్రిరెడ్డిబీ ఆర్మూరు : ధర్మపురి అర్వింద్, రాకేశ్‌రెడ్డి బోధన్: మేడపాటి ప్రకాశ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి నిజామాబాద్ అర్బన్: యెండల లక్ష్మీ నారాయణ, ధన్‌పాల్ సూర్యనారాయణ నిజామాబాద్ రూరల్: దినేశ్ కులాచారి, బస్వా లక్ష్మీ నారాయణ, బాల్కొండ: అన్నపూర్ణమ్మ లేదా ఆమెతనయుడు మల్లికార్జున్‌రెడ్డి జుక్కల్: అరుణతార ఎల్లారెడ్డి: బానాల లక్ష్మారెడ్డిబీ కామారెడ్డి : వెంకటరమణారెడ్డి కోరుట్ల: అర్వింద్, సురభి సునీల్, డాక్టర్ వెంకట్ జగిత్యాల: బోగ శ్రావణి ధర్మపురి: లక్ష్మణ్, కన్నం అంజయ్య మంథని: సునీల్‌రెడి, పెద్దపల్లి : ప్రదీపకుమార్, సురేశ్‌రెడ్డి, గుజ్జుల రామకృష్ణారెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, కరీంనగర్: బండి సంజయ్, చొప్పదండి: బొడిగె శోభ హుజూరాబాద్: ఈటల రాజేందర్ వేములవాడ : సీహెచ్ వికాస్, తుల ఉమబీ జహీరాబాద్: రామచంద్ర సంగారెడ్డి : రాజు, దేశ్‌పాండే పటాన్‌చెరు: ఎడ్ల రమేశ్, నందీశ్వర్‌గౌడ్, గడీల శ్రీకాంత్‌గౌడ్ నారాయణఖేడ్ : సంగప్ప, విజయ్‌పాల్‌రెడ్డి ఆందోల్ : బాబూ మోహన్‌బీ నర్సాపూర్ : గోపి, మురళీయాదవ్ దుబ్బాక: ఎం. రఘునందన్‌రావు హుస్నాబాద్: బొమ్మ శ్రీరాం, సురేందర్‌రెడ్డిబీ కల్వకుర్తి : టి. ఆచారి షాద్‌నగర్ : మిథున్‌రెడ్డి, అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి జడ్చర్ల: చిత్తరంజన్‌దాస మహబూబ్‌నగర్: ఏపీ జితేందర్‌రెడ్డి గద్వాల: డీకేఅరుణ మక్తల్: జలంధర్‌రెడ్డి దేవరకద్ర: ఎగ్గని నర్సింలు, సుదర్శన్‌రెడ్డి, పవన్ కుమార్ కొల్లాపూర్: సుధాకర్‌రావు అచ్చంపేట: సతీషమాదిగ ఇబ్రహీంపట్నం: బూర నర్సయ్యగౌడ్, దయానంద్‌గౌడ్ ఎల్బీనగర్: జి.మనోహర్‌రెడ్డి, సామ రంగారెడ్డి, వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి మహేశ్వరం: అందెల శ్రీరాములు యాదవ్, బొక్కా నర్సింహారెడ్డి రాజేంద్రనగర్: తోకల శ్రీనివాసరెడ్డి, బుక్కా వేణుగోపాల్, వై. శ్రీధర్, మల్లారెడ్డి శేరిలింగంపల్లి: రవికుమార్, యోగానంద్ చేవెళ్ల: కంచర్ల ప్రకాశ్, విజయ్‌కుమార్ పరిగి:మారుతి కిరణ్, పరమేశ్వర్‌రెడ్డి మేడ్చల్: మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి మల్కాజ్‌గిరి: ఎన్.రాంచందర్‌రావు, శ్రావణ్‌కుమార్ కుత్బుల్లాపూర్: కూన శ్రీశైలం గౌడ్ కూకట్‌పల్లి: మాధవరం కాంతారావు, ఎం. ప్రేమ్‌కుమార్, వడ్డేపల్లి రాజేశ్వర్ ఉప్పల్: ఎన్.వి.ఎస.ఎస. ప్రభాకర్ ముషీరాబాద్: డాక్టర్ కె.లక్ష్మణ్ లేదా బండారు విజయలక్ష్మిబీ మలక్‌పేట : సురేందర్‌రెడ్డి, లింగాల హరిగౌడ్, సుభాషచందర్‌జీ , రవీందర్‌రెడ్డి, చీకోటి ప్రవీణ్ అంబర్‌పేట: జి. కిషన్‌రెడ్డి, గౌతంరావు ఖైరతాబాద్: ఎన్.వి.సుభాష, చింతల రాంచంద్రారెడ్డి. గౌతంరావు జూబ్లీహిల్స్ : లంకల దీపక్‌రెడ్డి, డాక్టర్ వీరపనేని పద్మ సనత్‌నగర్ :మర్రి శశిధర్‌రెడ్డి. శ్యాంసుందర్ సికింద్రాబాద్: బండ కార్తీకరెడ్డి, జయసుధ, ఆదం విజయ్‌కుమార్ కంటోన్మెంట్ (ఎస్సీ): డాక్టర్ విజయరామారావు, నారాయణరావు నల్లగొండ: మాదగాని శ్రీనివాసగౌడ్, నాగం వర్షిత్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవి మునుగోడు : కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నకిరేకల్ : చేపూరి రవీందర్ దేవరకొండ: లాలూనాయక్, కల్యాణ్ నాయక్ నాగార్జునసాగర్ : కంకనాల నివేదిత, రిక్కల ఇంద్రసేనారెడ్డి, ముసిరెడ్డి పాండురంగారెడ్డి మిర్యాలగూడ : సాధినేని శ్రీనివాస్ కోదాడ: రామూ యాదవ్, పనగాల నారాయణ, నూకలపద్మారెడ్డి, వేలంగి రాజు సూర్యాపేట: సంకినేని వెంకటేశ్వరరావు తుంగతుర్తి: కడియం రాంచంద్రయ్య ఆలేరు: పడాల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీను భువనగిరి: గూడూరు నారాయణరెడ్డి, పీవీ శ్యాంసుందర్ జనగాం: దశమంత్‌రెడ్డి ఘన్‌పూర్: విజయరామారావు లేదా వెంకటేశ్వర్లు డోర్నకల్: సంగీతనాయక్. లక్ష్మణ్‌నాయక్‌బీ మహబూబాబాద్: హుస్సేన్‌నాయక్, సీత య్యబీ నర్సంపేట: రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరకాల: డాక్టర్ కాళీ ప్రసాద్, విజయచందర్, డాక్టర్ సంతోష్ వరంగల్ వెస్ట్: రావు పద్మ, రాకేశ్‌రెడ్డి, ధర్మారావు వరంగల్ ఈస్ట్: ఎర్రబెల్లి ప్రదీపరావు వర్ధన్నపేట: కె.శ్రీధర్, చీటూరు అశోక్ ములుగు: కృష్ణవేణి, ప్రహ్లాద్, రాజు భూపాలపల్లి: చందుపట్ల కీర్తిరెడ్డి కొత్తగూడెం: రంగాకిరణ్ భద్రాచలం: కుంజా సత్యవతి ఖమ్మం:గల్లా సత్యనారాయణ, శారద పాలేరు: శ్రీధర్‌రెడ్డిబీ సత్తుపల్లి : రామలింగేశ్వర్‌రావు.

# సంపాదకీయం

## సెమీస్ ఢోకా లేదు..

### ప్రపంచ కప్ లో ఆ జట్టుతోనే పెద్ద ముప్పు

క్రికెట్ అభిమానులను ఉర్రూతలూగించే ప్రపంచ కప్ మొదలైంది. పది జట్లు సర్వ సన్నద్ధం అయ్యాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న ఈ టోర్నీలో ఒక్కో జట్టు తొమ్మిది మ్యాచ్ లు ఆడతాయి. అంతా మిగతా 9 జట్లతో తలపడతాయి. లీగ్ దశ పూర్తయ్యేసరికి టాప్ 4లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్ కు వెళ్తాయి. ఈ ఆరులో ఆ నాలుగేవో..? సంచలనాత్మకంగా ఆడ గల సత్తా ఉన్న వెస్టిండీస్ ప్రస్తుతం ప్రపంచ కప్ లో లేదు. చరిత్రలో తొలిసారి ఆ జట్టు క్వాలిఫై కాలేకపోయింది. దీంతో సెమీస్ కు చేరగల సత్తా ఉన్న ఒక జట్టు పేరు తొలగింది. ఇక కచ్చితంగా సెమీస్ చేరతాయన్న అంచనాలున్న జట్లు ఆరు. అవి భారత్ , ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా. వీటిలోంచి కూడా నాలుగింటిని సెమీస్ కు పరిగణించ చాలి. అంటే రెండింటిని తీసివేయాలి. వేటినీ కాదనలేం..ఈ ఆరు జట్లలో సెమీస్ చేరే మూడింటిని మాత్రమే చెప్పమంటే భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా అని అనుకోవచ్చు. మరొక బెర్తుకు మూడు జట్ల మధ్య మ్యూజికల్ చైర్. వీటిలోనూ పాకిస్థాన్, న్యూజిలాండ్ ను ప్రధాన పోటీదారులుగా పరిగణించవచ్చు. ఐసీసీ టోర్నీల్లో బ్యాడ్ లక్ కు పెట్టింది పేరయినప్పటికీ దక్షిణాఫ్రికాను మరీ తీసిపారేయలేం. కాకపోతే ఉపఖండ పరిస్థితులను బట్టి పాకిస్థాన్ కు అవకాశాలెక్కువ అని చెప్పొచ్చు. సెమీస్ లో భారత్-పాక్?2011లో భారత్ -పాక్ సెమీస్ లో తలపడ్డాయి. నాడు దాయాదిని మట్టికరిపించిన టీమిండియా ఫైనల్లో శ్రీలంకనూ ఓడించి కప్ కట్టేసింది. కాగా, భారత్ ఈసారి కూడా సెమీస్ లో పాక్ తో తలపడే అవకాశం ఉంది. ఎందుకంటే.. లీగ్ దశలో టీమిండియా టాప్ లో నిలుస్తుంది అంచనా. ఇంగ్లండ్, ఆస్ట్రేలియా తర్వాతి స్థానాల్లో ఉంటాయి. అప్పుడు 1వ స్థానంలోని టీమిండియాకు, నాలుగో స్థానంలో నిలిచిన పాక్ కు మధ్య సెమీస్ జరుగుతుందని అంచనా వేయొచ్చు. మనకు ముప్పు..? అంచనా కాస్త అటుఇటు అయిందనుకుంటే.. టీమిండియాకు ఇంగ్లండ్ నుంచి మాత్రమే ముప్పు పొంచి ఉంది. లీగ్ దశలో అయినా, సెమీస్ లో అయినా బ్రిటిష్ జట్టను ఓడించడం కాస్త సవాలే. మలన్ ,బెయిర్ స్టో, రూట్, బట్లర్, బ్రూక్, లివింగ్ స్టోన్ తదితరులతో దుర్భేధ్య బ్యాటింగ్ తో ఉన్న ఇంగ్లిష్ టీమ్.. భారత బౌలర్లకు కఠిన పరీక్ష పెడుతుంది. బౌలింగ్ లోనూ కరన్, వోక్స్, మోయిన్ అలీ భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టే చాన్సుంది. ఈ ఒక్క గండం గనుక దాటితే టీమిండియా ప్రపంచ కప్ కొట్టేయడం ఖాయం.

# తీసివేతలే..!



వైరా : రేషన్ కార్డు... ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరులో ఇది ప్రధానం. ఏడేళ్లుగా కొత్తగా ఒక్క రేషన్ కార్డు మంజూరీ లేదు. ఈ మధ్యకాలంలో అతి కొద్దిమందికి మాత్రమే కార్డులిచ్చారు. ఇంకోపక్క కార్డులో చోటు సంపాదించాలంటే కష్టమే కానీ తొలగింపు ప్రక్రియ మాత్రం వేగంగా జరిగిపోతుంది. పెళ్లయిన ఆడపిల్ల మెట్టినింట్లోని రేషన్ కార్డులో పేరు ఎక్కించుకోవాలంటే నానాపాట్లు తప్పటం లేదు. గతంలో ఉన్న దగ్గర పేరు తొలగిస్తేనే మరోచోట చేర్చే వీలవుతుంది. ఈ నేపథ్యంలో పేరు తొలగించాలని దరఖాస్తు చేస్తే చాలూ క్షణంలో తొలగిస్తారు. అదే నమోదుకు మాత్రం ఏళ్లుగా ఎదురుచూడాల్సి వస్తోంది. ఫలితంగా అత్యవసర సమయాల్లో పేదలు ఆరోగ్య సేవలు పొందేందుకు ఇబ్బంది పడుతున్నారు.

మోక్షం ఎప్పుడో..కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూసేవారి సంఖ్య వేలల్లో ఉండగా అదే స్థాయిలో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చుకోవడానికి దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 21 మండలాల్లో వేల సంఖ్యలో ఈ దరఖాస్తులు ఆయా శాఖల పరిధిలోని అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్ఐ, తహసీల్దార్, డీఎస్‌వో స్థాయిలో అపరిష్కృతంగా ఉన్నాయి. వీటితోపాటు పేరు మార్పు కోసం కూడా అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినా అవి పరిష్కారానికి నోచుకోలేదు. సగానికిపైగా ఆయా స్థాయి అధికారుల వద్ద మూలుగుతున్నాయి. వీటికి మోక్షం కలిగి ప్రభుత్వం కుటుంబ సభ్యుల పేర్లు రేషన్ కార్డులో చేర్చడానికి, పేర్లు మార్చుకోవడానికి అవకాశం ఇస్తే సమస్య పరిష్కారమవుతుంది.

పేదలకు ఇబ్బందులు..

కొన్నేళ్ల నుంచి కుటుంబ సభ్యుల పేర్లు అదనంగా చేర్చడానికి వీల్లేకపోవటంతో రేషన్ బియ్యం అందడం లేదు. కొత్తగా పెళ్లయిన ఆడపిల్లలు పుట్టింటి దగ్గర కార్డుల్లో తమ పేరును తొలగించుకుని అత్తింటి దగ్గర దరఖాస్తు చేసుకుంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా వారి కార్డులో చోటు దక్కక ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం అందడంలేదు. కుటుంబంలోని చిన్నారులు, యువకుల పేర్లు కూడా ఎక్కించడానికి అవకాశం లేదు. ఏదైనా ధ్రువపత్రం అవసరమైనపుడు కార్డులో స్వీయ వివరాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోవాలంటే రేషన్ తప్పనిసరి. కార్డున్నా అందులో పేర్లు లేకపోవడం, పేర్లు తప్పుగా ఉండటంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

మచ్చుకు కొన్ని.. కొణిజర్ల మండలం మేకలకుంటకు చెందిన భూక్యా శేఖర్, ఉషకు రేషన్ కార్డు లేదు. వారి తల్లిదండ్రుల కార్డులో పేరు చేర్చడానికి వీలుపడక ఇబ్బంది పడుతున్నారు.ఏన్కూరు మండలానికి చెందిన నాగేంద్రకు పదేళ్ల లోపు వయసు ఉన్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి పేర్లు చేర్చేందుకు అనేకసార్లు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి విసుగు చెందారు. వేరే మండలానికి చెందిన యువతికి తల్లాడకు చెందిన వ్యక్తితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. పేరు నమోదుకు తొలుత ఊరిలో ఉన్న రేషన్ కార్డులో పేరు తొలగించారు. తల్లాడలో అత్తారింటి దగ్గర దరఖాస్తు చేస్తే మాత్రం ఇంతవరకూ ఎటువంటి అవకాశం లేదని చెబుతుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొణిజర్లకు చెందిన ఓ మహిళ ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకుంది. కార్డు లేకపోవడంతో సీఎం సహాయ నిధి కోసం ఆదాయ ధ్రువపత్రం తీసుకుని దాని ద్వారా దరఖాస్తు చేసుకుంది. కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలని సత్తుపల్లిలో ఖమ్మం రూరల్-1లో అత్యధికంగా 8315, సత్తుపల్లిలో 3200 వరకు దరఖాస్తులు రాగా, మధిర, కల్లూరులో 2500, ఇతర మండలాల్లో 1200 నుంచి 2500 వరకు దరఖాస్తులు వచ్చాయి. పేరు మార్పు కోసం కూడా ఒక్కో మండలంలో 150 నుంచి వెయ్యి వరకు దరఖాస్తులు వచ్చాయి. కూసుమంచి, ముదిగొండ, కల్లూరులో అధికంగా అందాయి.

# విస్తరించనున్న సేవలు..



ఖమ్మం : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)ల సేవలను విస్తరించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లాల సంఖ్య 10 నుంచి 33కు పెరిగింది. కొత్తగా ఏర్పడిన అన్ని జిల్లాల్లో ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటుకు రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంకు సన్నాహాలు మొదలు పెట్టింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు 2020లో ఎన్నికలు జరిగాయి. కొత్త జిల్లాలకనుగుణంగా జిల్లా పరిషత్‌లు ఏర్పడ్డాయి కానీ డీసీసీబీలు ఏర్పాటు కాలేదు. నాబార్డు అనుమతి సహా పలు సమస్యలు ఉన్నందున ప్రభుత్వం పాత వ్యవస్థనే ఇప్పటివరకు కొనసాగిస్తోంది. ఇప్పుడు అన్ని జిల్లాల్లోనూ ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొత్త డీసీసీబీల ఏర్పాటులో జాప్యం దృష్ట్యా ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలనే యోచనలో ఉంది. ఇందులో భాగంగానే కొత్తగూడెంలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.కొత్తగూడెంలో...ఖమ్మం జిల్లా తర్వాత అత్యధికంగా డీసీసీబీ శాఖలు, సహకార సంఘాలు ఉన్న కొత్తగూడెంలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయనున్నారు. ఈ జిల్లాలోని 19 డీసీసీబీ శాఖలు, 21 సహకార సంఘాలతో పాటు ములుగు జిల్లాలోని రెండు డీసీసీబీ శాఖలు, రెండు సహకార సంఘాలైన వాజేడు, వెంకటాపురాలను దీని పరిధిలోకి తీసుకొస్తారు. మహబూబాబాద్ జిల్లాలోని రెండు శాఖలతోపాటు గార్ల, బయ్యారం సహకార సంఘాలను సమీప ఖమ్మంలోనే ఉంచుతారు. ప్రాంతీయ కార్యాలయం నిర్వహణకు ప్రత్యేకంగా డీజీఎం(డిప్యూటీ జనరల్ మేనేజర్) లేదా ఏజీఎం(అసిస్టెంట్ జనరల్ మేనేజర్) స్థాయి అధికారిని నియమిస్తారు. నాలుగు జిల్లాలకు ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న డీసీసీబీకి తాజాగా ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు ద్వారా మరింత అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నారు.

ఏజెన్సీ రైతులకు ప్రయోజనం

ప్రధానంగా భద్రాచలం ఏజెన్సీతోపాటు ఇల్లెందు తదితర ప్రాంతాలకు కూడా కొత్తగూడెం అనుకూలంగా ఉంటుంది. చాలా వరకు రైతులకు లేదా వినియోగదారులకు సుదూర ప్రాంతంలో ఉన్న ఖమ్మం వచ్చే బాధ తప్పుతుంది. ములుగు జిల్లా వాసులకు కొంత దూరభారం తగ్గనుంది.

నేరుగా ప్రాంతీయ కార్యాలయం

ప్రస్తుతం డీసీసీబీ బ్రాంచి కార్యాలయాలు లేదా ఇతర భవనాల్లో ప్రాంతీయ కార్యాలయాలను ప్రారంభిస్తారు. వీటిలో అధికారులు, సిబ్బందిని ప్రస్తుతం ఉన్న డీసీసీబీల నుంచి సర్దుబాటు చేస్తారు. సేవలను వికేంద్రీకరిస్తారు. ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతులు తమకు ఏదైనా సమస్య ఉంటే డీసీసీబీలను సంప్రదించి సాయం పొందుతున్నారు. ఇక నుంచి వారు నేరుగా ప్రాంతీయ కార్యాలయాలను సంప్రదించే అవకాశం ఉంటుంది.

కొత్తగూడెంలో ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉంది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే అక్కడ ప్రారంభిస్తాం. ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుతో సహకార రైతులకు మెరుగైన సేవలందుబాటులోకి వస్తాయి. భద్రాద్రితోపాటు ములుగు జిల్లా వాసులకు కొత్తగూడెం అందుబాటులో ఉంటుంది. కార్యాలయం ఏర్పాటు చేయటంతో పాటు అవసరమైన అధికారులను, సిబ్బందిని కూడా ఇక్కడి నుంచి పంపుతాం.

కూరాకుల నాగభూషయ్య, ఛైర్మన్

# ట్రాక్ తప్పకుండా...

ఖమ్మం : రైలు మార్గంలో ట్రాక్‌ను ప్రభావితం చేసే చెరువులను గుర్తించి తక్షణం వాటికి మరమ్మతులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వర్షాకాలంలో చెరువులు నీటితో నిండి సమీపంలోని రైల్వే ట్రాక్ పైకి నీరు వచ్చి చేరడం వల్ల రైళ్ల రాకపోకలకు అవరోధం ఏర్పడుతోంది. అలాంటి వాటిని గుర్తించి అలుగులు, తూములు సరిగా పని చేసేలా చూడాలని, పంట కాలువల్లో పూడిక తొలగించి నీరు దిగువకు వెళ్లేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రైల్వే, జల వనరుల శాఖ అధికారులు సంయుక్తంగా రైల్వే ట్రాక్‌ను ప్రభావితం చేసే చెరువులను గుర్తించారు. కొన్ని తటాకాలు దూరంలో ఉన్నా వాటికి నీటిని అందించే వాగులు, వంకలు ఎగువ భాగంలో ప్రభావితం చేసేలా ఉంటే అలాంటి వాటికి సైతం మరమ్మతులు చేపట్టనున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో రైల్వే ప్రభావిత చెరువులు 109 గుర్తించారు. వీటికి చేయాల్సిన తక్షణ మరమ్మతు పనులపై అంచనాలు రూపొందిస్తున్నారు.

మార్గాలు ఇలా... కాజీపేట - విజయవాడ మార్గంలో మున్నేరు నదికి ఎడమ వైపు రెండు వరుసల్లో రైల్వే ట్రాక్ ఉంది. ఇదే మార్గంలో మూడో రైల్వే లైను నిర్మాణానికి భూసేకరణ పూర్తి కావచ్చింది.డోర్నకల్ నుంచి కొత్తగూడెం రైల్వే మార్గం సింగరేణి మండలం మీదుగా వెళుతుంది. కొత్తగూడెం నుంచి సత్తుపల్లి రైల్వే మార్గం కొత్తగా నిర్మించారు. ప్రస్తుతం సత్తుపల్లి నుంచి బొగ్గు రవాణా చేస్తున్నారు.మూడు రైల్వే మార్గాల్లో జిల్లాలోని ట్రాక్‌ను ప్రభావితం చేసే 109 చెరువులు గుర్తించారు. వీటిలో 94 పరిస్థితి బాగుందని, తక్షణ మరమ్మతులు అవసరం లేదని నీటిపారుదల శాఖ ఇంజినీర్లు నిర్ధారించారు. మిగతా 15 మరమ్మతులు చేయాల్సి ఉండగా అందులో 13 తటాకాలకు రూ.10 లక్షలకు తక్కువగానే నిధులు అవసరమని, రెండింటికి మాత్రం రూ.10 లక్షలకు మించి కావాల్సి ఉంటుందని నివేదిక రూపొందించారు. ఇందులో కల్లూరు మండలం పోచారం సమీపంలోని పెద్దచెరువుకు రూ.22.17 లక్షలతో ఇప్పటికే మరమ్మతులు చేపట్టగా పనులు పురోగతిలో ఉన్నాయి. మరోదానికి మాత్రమే రూ.10 లక్షలకు పైగా నిధులు మంజూరు కావాల్సి ఉంది.

మండలాల వారీగా ఇలా...ఖమ్మం అర్బన్ 6, రఘునాథపాలెం 11, వైరా 2, కొణిజర్ల 5, సింగరేణి 16, తల్లాడ 8, కల్లూరు 10, మధిర 7, ఎర్రుపాలెం 19, చింతకాని 14, బోనకల్లు 11 చెరువులున్నాయి.జిల్లాలో 109 రైల్వే ఎఫెక్టెడ్ చెరువులు గుర్తించాం. పూర్తి అంచనాలు రూపొందించి పై అధికారుల అనుమతులు తీసుకుని మరమ్మతులు చేపడతాం. వేసవిలో పనులు పూర్తి చేస్తాం. శంకర్‌నాయక్, సీఈ, జలవనరుల శాఖ

# మొలకెత్తని నాసిరకం విత్తనం..!

మహబూబాబాద్ : పల్లెల్లో పచ్చందాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా హరితహారం కార్యక్రమాన్ని చేపడుతోంది. ఇందుకోసం పంచాయతీల్లో వన నర్సరీలను నెలకొల్పారు. వీటిద్వారా గ్రామానికి, ప్రజలకు అవసరమైన మొక్కల పెంపకం చేపడుతున్నారు. 2023-24 హరితహారం కోసం నర్సరీల్లో నాటిన విత్తనాలు నాణ్యత లోపంతో పూర్తి స్థాయిలో మొలకెత్తలేదు. రూ. లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన విత్తనాలు మట్టిపాలు కావడంతో ఒక్కో నర్సరీల్లో రెండు, మూడుసార్లు విత్తారు. అధిక డబ్బులు వెచ్చించి మార్కెట్లో కొనుగోలు చేసిన విత్తనాలు మొలకెత్తడం లేదని స్థానికంగా సేకరించిన బంతి, తంగేడు, గుల్మొహర్ (తురాయి) విత్తనాలను తెచ్చి నాటారు. పలు నర్సరీల్లో మొక్కలు లేని ప్లాస్టిక్ సంచులు కనిపిస్తున్నాయి. కొన్ని చోట్ల షెడ్ నెట్‌లను ఏర్పాటు చేయలేదు. పెరుగుతున్న ఎండ మొక్కల ఎదుగుదలపై ప్రభావం చూపనుంది. హరితహారం లక్ష్యం నేలపాలు



కానుంది. ఇప్పటి నుంచే అధికారులు క్షేత్రస్థాయిలో తగిన చొరవ చూపి మొక్కల ఎదుగుదలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రూ. లక్షలు ఖర్చు పెట్టినా..

జిల్లాలో ఈసారి 55 లక్షల విత్తనాలు నాటారు. ఇందులో 41.85 లక్షల విత్తనాలను కొనుగోలు చేశారు. 13.15 లక్షల విత్తనాలను స్థానికంగా సేకరించినట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. నిమ్మ, దానిమ్మ, మునగ, సపోట, బాదం, కదంబ తదితర విత్తనాలను మార్కెట్లో కొనుగోలు చేశారు. వీటిలో సగం వరకు మొలకెత్తలేదని సమాచారం. ఇందుకు రూ.16 లక్షల వరకు ఖర్చు చేశారు. ఈ నిధులు పంచాయతీల్లో ప్రత్యేకంగా కేటాయించిన గ్రీన్ బడ్జెట్ నుంచి కొనుగోలు చేశారు. సర్కారు సొమ్ము కావడంతో అడిగే వారు లేరంటూ కొందరు విత్తనాలు కొనుగోలు చేయకున్నా చేసినట్లు బిల్లు కాజేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సిందేనా

గ్రామాల్లోని వన నర్సరీల్లోని మొక్కలు సమయానికి అందుతాయని అధికారులు చెబుతున్నా..సందేహం వ్యక్తమవుతోంది. హరితహారం నాటికి అందుబాటులోకి రాకుంటే గతంలో మాదిరిగా ప్రైవేటు నర్సరీల బాట పట్టాల్సిందే. అక్కడ అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు రానున్నాయి. ఇప్పటికే విత్తనాల ఖర్చులతోపాటు మొక్కల కొనుగోలుకు అయ్యే వ్యయం పంచాయతీలపై అదనపు భారం కానుంది.

సంచుల్లో మొక్కలు లేకుండా కనిపిస్తున్నది కొత్తగూడ మండలం కొత్తపల్లిలోని నర్సరీ. 12 వేల మొక్కల లక్ష్యంగా 12 బెడ్లను ఏర్పాటు చేశారు. విత్తనాల కోసం రూ. 10 వేలు వెచ్చించినా మొలకెత్తలేదు. రెండు, మూడుసార్లు నాటారు. సమయం లేకపోవడంతో చివరకు బంతి నారు పోశారు. సంచుల్లో ఉన్నవి ఎండలకు ఎండిపోకుండా ఉండేందుకు షెడ్ నెట్ ఏర్పాటు చేయలేదు. హరితహారం ప్రారంభం నాటికి మొక్కలు అందేలా లేవని.. ప్రైవేటు నర్సరీల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆరోపిస్తున్నారు. లోకల్ విత్తనాలు నాటడడంతో మొలక శాతం తగ్గిందని నిర్వహకులు అంటున్నారు.కొత్తగూడ

దంతాలపల్లి మండలం గున్నేపల్లి నర్సరీలో పాతవి 5 వేల మొక్కలుండగా ఈసారి 15 వేలు పెంచుతున్నారు. మొత్తం 12 రకాలున్నాయి. మూడు బెడ్లలో నాటిన మూడు వేల విత్తనాలు మొలకెత్తలేదు. రెండుసార్లు నాటినా ఫలితం కానరాలేదు. స్థానికంగా లభించిన విత్తనాలు తెచ్చి విత్తారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటం, నాసిరకం విత్తనాలు ఎంపిక చేసుకోవడం వల్లనే మళ్లీ నాటాల్సి వచ్చింది. అవి మొలకెత్తి పెద్దయ్యే వరకు సమయం పట్టనుంది.దంతాలపల్లి

కవర్లలో అక్కడక్కడ మొక్కలు కనిపిస్తున్న ఇది పెద్దవంగర మండలం పోచారం పంచాయతీ నర్సరీ. ఇందులో 16 రకాల మొక్కలను పెంచుతున్నారు. గతేడాది నాటినవి 4 వేల మొక్కలు ఉండగా ఈసారి కొత్తగా 10 వేలు పెంచుతున్నారు. నర్సరీ నిర్వహణకు రూ.62 వేలు ఖర్చు చేశారు. సంచుల్లో నాటిన విత్తనాలు పూర్తిస్థాయిలో మొలకెత్తలేదు. దీనికి తోడు ఇటీవల కురిసిన వడగళ్ల వానతో మొక్కల శాతం తగ్గిందని నిర్వాహకులు చెబుతున్నారు. పెద్దవంగర

ఇతను ఇనుగుర్తి మండలం చిన్నముప్పారం పంచాయతీ వన నర్సరీ వనసేవకుడు ఆర్. రాము. తాను చూపిస్తున్న కాయలు గుల్మొహర్(తురాయి) మొక్కలవి. మొదట్లో మార్కెట్లో కొనుగోలు చేసిన విత్తనాలు తెచ్చిన నర్సరీలో నాటితే మొలకెత్తలేదని స్థానికంగా విత్తనాలను సేకరించారు. ఇందులో భాగంగానే ఇనుగుర్తికి వెళ్లే దారికి ఇరువైపులా ఉన్నా గుల్మొహర్ చెట్లు కాసిన కాయల్ని తెచ్చి ఎండలో పెట్టి అందులోని విత్తనాలు తీసి రెండు వేలు నాటారు. హరితహారం నాటికి అందుబాటులోకి..సన్యాసయ్య, డీఆర్‌డీవో, మహబూబాబాద్

హరితహారం ప్రారంభం నాటికి మొక్కలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం పెంచుతున్న వాటితో పాటు గతేడాది పెంచిన అందుబాటులో ఉన్నాయి. నర్సరీల్లో ప్రస్తుతం పెరుగుతున్న వాటితో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. కార్యక్రమం నాటికి అనుకున్న స్థాయిలో ఎదుగుతాయి.జిల్లా వివరాలు పంచాయతీలు 461 నర్సరీలు 461 మొక్కల పెంపకం లక్ష్యం(లక్షల్లో) 83 రకాలు 29 నాటిన విత్తనాలు (లక్షల్లో) 55 విత్తనాల కొనుగోలు వ్యయం (రూ.లక్షల్లో) 16

# భూ వివాదంలో పరస్పర దాడులు

మహబూబాబాద్ : భూ వివాదంలో ఇరువర్గాలు పరస్పర దాడులకు పాల్పడ్డారు. సోలిపురంకు చెందిన గొల్ల కురుమలకు, తరిగొప్పులకు చెందిన పోచయ్య మధ్య భూ వివాదం నెలకొంది. పోచయ్య హద్దు రాళ్లు పాతుతుండగా గొల్లకురుమలు అడ్డుకున్నారు. ఇరువర్గాల వారు కర్రలు, మట్టి పెల్లలతో దాడులకు దిగారు. దాడిలో సోలిపురంకు చెందిన ఎర్ర బీరయ్య, సాయిల్ల కనకమ్మ, చెవిటి లచ్చమ్మ, చెవిటి యాదయ్యకు గాయాలయ్యాయి. తమపై దాడికి పాల్పడిన జడ్పీటీసీ సభ్యురాలి భర్త ముద్దసాని వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు అర్జుల మధుసూదన్‌రెడ్డి, తాళ్లపల్లి పోచయ్యపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై తాళ్లపల్లి పోచయ్యను వివరణ కోరగా తన పట్టా భూమిలోకి గొల్ల కురమలు అక్రమంగా ప్రవేశించి తనపై దాడి చేశారని తెలిపారు. ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు నర్మెట్ట సీఐ నాగబాబు తెలిపారు.

# డబుల్ దందా

జగిత్యాల: జగిత్యాల పట్టణంలో ఇళ్లు లేని పేదల కోసం నూకపల్లి అర్బన్ కాలనీలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపులో అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. అర్హులకు కాకుండా అనర్హులకు ఇళ్లు కేటాయించిన విషయమై జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా తీవ్రంగా పరిగణించారు. వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించిన నేపథ్యంలో కొన్ని ఇళ్ల కేటాయింపునకు కారకుడైన పొరుగు సేవల ఒప్పంద ఉద్యోగి రాకేశ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అతను అర్హులైన వారి పేర్లను తొలగించి వారిస్థానంలో తనకు దగ్గరి వారి పేర్లను, డబ్బు ఇచ్చిన వారి పేర్లను చేర్చినట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించగా 9 మంది పేర్లను అర్హుల జాబితాలో చేర్చినట్లు ప్రాథమికంగా తేలింది.

విచారణలో వెలుగు చూస్తున్న అక్రమాలు

రెండు పడక గదుల ఇళ్ల కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు రాగా రెండుసార్లు విచారణ జరిగింది. 4520 ఇళ్ల కోసం 13,900 దరఖాస్తులు రాగా గత సంవత్సరం తహసీల్దార్ల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అర్హుల జాబితా తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. అనేక మంది అర్హులకు ఇళ్లు రావటం లేదని తహసీల్దార్లు కాకుండా ఇతర అధికారులతో విచారణ జరిపించాలని ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయటంతో మరోసారి విచారణ జరిపి 3722 మందిని అర్హులుగా తేల్చారు. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఇటీవల వారందరికీ ఇళ్ల పట్టాలివ్వగా అందులో సుమారు వందమంది వరకు అనర్హులున్నట్లు తెలుస్తోంది. రెండు పడక గదుల ఇళ్ల కోసం కొందరు



ప్రజాప్రతినిధులు కిందిస్థాయి ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించినట్లు ప్రచారం జరుగుతోంది. ఒక్కో ఇంటికి రూ.లక్ష వరకు వసూలు చేసి అనర్హులకు ఇళ్లు కేటాయించారన్న ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు మొదట 4048 మందిని అర్హులుగా తేల్చగా అందులో 326 మంది పేర్లు సాంకేతిక కారణాలతో తిరస్కరించారు. సకల జనుల సర్వే 2016 ఆధారంగా రాష్ట్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి కొన్నింటికి తిరస్కరించగా అందులో ఇళ్లు లేని పేదలే ఉన్నారు. పట్టణంలో రేషన్‌కార్డు ఉన్న వారే ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా కొందరు దళారులు రేషన్‌కార్డులను మార్ఫింగ్ చేసి ఇతర ప్రాంతాల వారికి అక్రమంగా ఇళ్లు లభించేలా దందాకు తెరలేపినట్లు భావిస్తున్నారు. 3722 మందికి ఇళ్లు కేటాయించినప్పటి నుంచి వందలాది మంది పేదలు ఇళ్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇళ్ల కోసం కొత్తగా వందలాది దరఖాస్తులు వస్తున్నాయి. నూకపల్లిలో నిర్మించిన 4520 ఇళ్లల్లో 500 ఇళ్లు మల్యాల మండలానికి కేటాయించగా 3722 ఇళ్ల పంపిణీ జరిగింది. మరో 298 ఇళ్లు మాత్రమే కొత్తగా కేటాయించే అవకాశం ఉంది.

# బొందివాగు నాలా పనులకు అడుగులు



వరంగల్ : నగరంలో ఏటా వర్షాకాలం వరద ఉద్ధృతంగా పారే హంటర్‌రోడ్ బొందివాగు నాలాకు శాశ్వత పరిష్కారానికి అడుగులు పడ్డాయి. 15-20 ఏళ్ల భవిష్యత్తు అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు డిజైన్ చేశారు. బొందివాగు నాలా నుంచి భద్రకాళి చెరువులోకి సుమారు 20వేల క్యూసెక్కుల వరదనీరు చేరేలా ఇన్‌ఫాల్ రెగ్యులేటర్ (పెద్ద ఫ్వలింగ్ షట్టర్లు) ఏర్పాటు చేయాలని ప్రతిపాదించగా.. నాలా విస్తరణ, రిటైనింగ్ వాల్స్ తదితర పనులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.158.06 కోట్ల నిధులు కేటాయించిన విషయం విధితమే మూడ్రోజుల కిందట వరంగల్ పర్యటనకు వచ్చిన సందర్భంగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పనుల నిర్వహణ బాధ్యతలను నీటిపారుదల శాఖకు అప్పగించారు.

పనుల ప్రతిపాదనలిలా..

హంటర్‌రోడ్ ఆర్వోబీ నుంచి భద్రకాళి చెరువు వరకు 50 మీటర్ల నాలాను విస్తరిస్తారు.

20వేల క్యూసెక్కుల వరదనీరు నేరుగా చెరువులోకి వెళ్లేందుకు గాయత్రిగుడి కట్ట వద్ద ఇన్‌ఫాల్ రెగ్యులేటర్ షట్టర్లు బిగిస్తారు.

భద్రకాళి చెరువులోకి వచ్చే వరద నీటిని త్వరగా బయటకు పంపించేందుకు హనుమకొండ కాపువాడ మత్తడి వద్ద, వరంగల్ పోతననగర్ మత్తడి వద్ద డౌన్ స్ట్రీమ్ ఫ్వలింగ్ షట్టర్లు ఏర్పాటు చేస్తారు.

రైల్వే ట్రాక్ నుంచి భద్రకాళి చెరువు కట్ట వరకు సుమారు 1100 మీటర్ల పొడవు, 50 మీటర్ల వెడల్పుతో నాలాకు ఇరువైపులా, కాపువాడ మత్తడి నుంచి అలంకార్ వంతెన వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణం చేస్తారు.

అలంకార్ వంతెన నుంచి కాకతీయ కాలువ యూటీ వరకు నాలా పూడికతీత పనులు చేపడతారు.

కాలనీల వైపు వెళ్లకుండాహంటర్‌రోడ్ బొందివాగు వరదనీరు నేరుగా భద్రకాళి చెరువులోకి వెళ్లేలా ఇన్‌ఫాల్ రెగ్యులేటర్లు బిగిస్తే.. సాయినగర్, ఎన్టీఆర్‌నగర్, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీ, గాయత్రినగర్, రామన్నపేట బీసీ కాలనీ, పోతననగర్, హంటర్‌రోడ్ ప్రధాన రహదారి కాలనీలకు ముంపు సమస్య ఉండదని నీటిపారుదల శాఖ అధికారులంటున్నారు. ఆర్నెళ్లలో పనులు పూర్తి కావాలని, వచ్చే వర్షాకాలం వరకు ఇన్‌ఫాల్ రెగ్యులేటర్ షట్టర్లు, డౌన్‌స్ట్రీమ్ ఫ్వలింగ్ షట్టర్లు బిగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

# చిన్నమొత్తాల పొదుపు... భవితకు మదుపు

జగిత్యాల: వివిధ వర్గాలకు ప్రయోజనం చేకూర్చేలా అనేక పొదుపు, బీమా, పింఛను తదితర పథకాలను ప్రవేశపెడుతున్న తపాలా శాఖ జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా నేటినుంచి ఈ నెల 13వ తేదీ వరకు ప్రత్యేకంగా అవగాహన చేపట్టనుంది. పోస్టల్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. ఒకప్పుడు కేవలం ఉత్తరాల బట్వాడా వరకే పరిమితమైన తపాలాశాఖ ఇప్పుడు బ్యాంకింగ్, బీమా, ప్రావిడెంట్ ఫండ్, జాతీయ, అంతర్జాతీయ పార్సల్, పింఛను, ఆధార్ నమోదు, రైల్వే రిజర్వేషన్ తదితర సదుపాయాలను ప్రజల ముంగిటకు తెచ్చింది. ఖాతాదారులు పోస్టాఫీసుకు రాకుండా ఇంటి నుంచే సేవలు పొందే అవకాశాలను కల్పించడంతో ప్రజల ఆదరణ పెరుగుతోంది.

సాధారణ ఖాతాలు

రూ.500తో పొదుపుఖాతా తీసుకోవచ్చు. చెక్కు, ఏటీఎం కార్డు సదుపాయం ఉంటుంది. ఖాతాలో జమపై నాలుగు శాతం వడ్డీ చెల్లిస్తారు. ఐదు సంవత్సరాల కాలపరిమితితో ప్రతి నెలా కొంతమొత్తం పొదుపు చేసుకునేలా రికరింగ్ డిపాజిట్ పథకం ఉంది. ప్రతి నెలా కనీసం రూ.100 చెల్లింపుతో నిర్వహించే ఈ పథకంలో 6.5 శాతం వడ్డీ చెల్లిస్తారు. టైమ్ డిపాజిట్ పథకంలో 1, 2, 3, 5 సంవత్సరాలకు డిపాజిట్ చేసుకోవచ్చు. దీనిపై వరుసగా 6.9 నుంచి 7.5 శాతం వడ్డీరేటు ఉంటుంది. 60 సంవత్సరాల వయస్సు పైబడిన వారు మాత్రం ఐదేళ్ల కాలపరిమితితో జమచేసిన సొమ్ముపై 8.2 శాతం వడ్డీతో ప్రతి మూడు నెలలకోమారు చెల్లిస్తారు. రూ.100తో డిజిటల్ ఖాతా తీసుకోవచ్చు. ఐపీపీబీ యాప్‌తో బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవచ్చు.

పన్ను మినహాయింపు.. బహుళ ప్రయోజనకరం

ఐదు సంవత్సరాల కాలపరిమితితో ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకంపై 7.7 శాతం వడ్డీ చెల్లిస్తారు. పబ్లిక్ ప్రావిడెంట్ పథకాన్ని 15 సంవత్సరాల పాటు కొనసాగించాల్సి ఉంటుంది. 7.1 శాతం వడ్డీరేటుతో ఈ రెండు పథకాల్లో ఆదాయ పన్ను మినహాయింపు ఉంటుంది. కిసాన్ వికాస పత్రంలో 7.5 శాతం వడ్డీ వర్తిస్తుంది. జమచేసిన సొమ్ము తొమ్మిది సంవత్సరాల ఏడు నెలల్లో రెట్టింపు అవుతుంది. బాలికల చదువు, వివాహ ఖర్చుల నిమిత్తం ఉద్దేశించిన పథకం 'సుకన్య సమృద్ధి యోజన' కనీసం రూ.250తో ఈ ఖాతాను తీసుకోవచ్చు. 8 శాతం వడ్డీ రేటుతో 21 సంవత్సరాల తర్వాత చెల్లిస్తారు. అత్యధిక వడ్డీరేటు చెల్లించేలా మహిళల కోసం 'మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్' పథకం అత్యంత ప్రయోజనకరంగా ఉంది. అతి తక్కువ ఛార్జీలతో తపాలా కార్యాలయం నుంచి విదేశాలకు పార్సిల్స్‌ను సురక్షితంగా పంపించే సదుపాయం ఉంది. ఆధార్ నమోదు, సవరణ సేవలు, రైల్వే రిజర్వేషన్ తదితర సదుపాయాలు తపాలా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థల్లోని విశ్రాంత కార్మికుల ఇంటి వద్దకే వెళ్లి జీవన ప్రమాణ పత్రాలను చేసే ప్రక్రియ విశేష ఆదరణ పొందుతోంది.

య ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండు డివిజన్లు (పెద్దపల్లి, కరీంనగర్) ఉన్నాయి. కరీంనగర్ డివిజన్‌లో ప్రధాన పోస్టాఫీసులు 2 ఉండగా సబ్ 52, బ్రాంచి 289 ఉన్నాయి. పెద్దపల్లి డివిజన్‌లో ప్రధాన పోస్టాఫీసులు 2 ఉండగా సబ్ 40, బ్రాంచి పోస్టాఫీసులు 333 ఉన్నాయి.

బీమా, పింఛను సదుపాయాలు

పోస్టల్ బీమా పథకంలో తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ చెల్లిస్తారు. ఇందులో పదేళ్ల కాలపరిమితికి రూ.52 వేల బోనస్ చెల్లిస్తారు. సుమారు రూ.400 ప్రీమియంతో రూ.10 లక్షల ప్రమాదబీమా పథకం ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి ఈ పథకం వర్తిస్తుంది. ఇదే తరహాలో గ్రామీణ తపాలాబీమా పథకంలో రూ.10 లక్షల బీమాకు రూ.48 వేల బోనస్ ఉండగా ఇది కేవలం గ్రామీణ ప్రాంతాల వారికి మాత్రమే వర్తిస్తుంది. దీనికి పాలసీ దారుడి వయస్సు ఎంచుకున్న కాలపరిమితి ఆధారంగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజనలో సంవత్సరానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు ప్రమాదబీమా వర్తించనుండగా ఇది 18 నుంచి 70 సంవత్సరాల వయసు గల వారికి వర్తిస్తుంది. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజనలో ఏడాదికి రూ.436 చెల్లిస్తే గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు జీవితబీమా సదుపాయం పొందవచ్చు. 18 నుంచి 50 సంవత్సరాల లోపు వయసు గల వారు దీనికి అర్హులు. అటల్ పెన్షన్ యోజనలో 18 నుంచి 40 సంవత్సరాల వయసు గల వారు ఈ పథకానికి అర్హులు.

మెరుగైన సేవలకు కృషి

వివిధ వర్గాల కోసం తపాలా శాఖ ప్రవేశపెట్టిన పథకాలను ఆయా వర్గాలు సద్వినియోగం చేసుకోవాలి. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండేలా కేంద్రం పొదుపు, బీమా, పింఛను తదితర పథకాలను రూపొందించింది. సమీపంలోని పోస్టాఫీసుల్లో ఈ పథకాల్లో ప్రజలు ప్రయోజనం పొందాలి. పోస్టల్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలి. పొదుపు, పింఛను, బీమా, పార్సిల్, ఆధార్ నమోదు, సవరణ, రైల్వే రిజర్వేషన్ తదితర సదుపాయాలను ఆయా ప్రాంతాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.శ్రీనివాస్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్, గోదావరిఖని

# తుది జాబితా.. తప్పుల తడక!




ములుగు:మరికొద్ది రోజుల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో అధికారులు జిల్లాలో ఓటరు సవరణ కార్యక్రమం ముగించారు. బుధవారం తుది ఓటరు జాబితా విడుదల చేశారు. అయితే ఇప్పటికీ కొంత మంద ఓట్లు గల్లంతయ్యాయి. మరి కొంత మందికి డబుల్ ఓట్లు నమోదయ్యాయి. ఓటరు జాబితాను పరిశీలించింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో డబుల్ ఓట్లు, చనిపోయిన వారి పేర్లతో జాబితాలో నమోదు అయినట్లు వెలుగులోకి వచ్చాయి. మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన వ్యక్తుల పేర్లు జాబితాలో ఉన్నాయి. మాణిక్యాపూర్‌లో పులి విమల, అయిలవేన కొంరమ్మలు మృతి చెందారు. వారి పేర్లు జాబితాలో ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన పుల్లి స్వామి, అయిలవేన సంపత్ ప్రస్తుతం జీవించి ఉన్నారు. జాబితాలో వారి పేర్లను తొలగించారు.

ః వంగర గ్రామంలో 211, 212, 213 పోలింగ్ కేంద్రాలకు చెందిన 25 మంది కొత్త ఓటర్లను.. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మంగళపల్లి గ్రామంలోని 214 పోలింగ్ కేంద్రంలో నమోదు చేశారు. రెండు మార్లు జాబితా మార్పు, చేర్పులు చేసినా తీరు మారలేదు. ఇదే గ్రామానికి చెందిన పెరుమాండ్ల సాయిశివరామకృష్ణ పేరు ఓటరు జాబితాలో ఉంది. ఇంటి నంబరు తప్పుగా నమోదు కావడం గమనార్హం.చంటయ్యపల్లి గ్రామంలోని 245 నంబరు పోలింగ్ కేంద్రానికి చెందిన 20 మంది పేర్లు కొత్తకొండ గ్రామంలోని బూత్‌లో నమోదయ్యాయి. నలుగురు మృతి చెందగా వారి పేర్లు జాబితాలో ఉన్నాయి. ఉపసర్పంచి భూక్యా బీక్యా పేరు ఓటరు జాబితాలో లేదు.

ఒకే వ్యక్తికి రెండు చోట్ల

వరంగల్ పెట్రోల్‌పంపు ప్రాంతానికి చెందిన హైమకు పదేళ్లక్రితం వివాహమైంది. భర్తతో కలిసి హనుమకొండ భవానీనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆమెకు హనుమకొండలో కూడా ఓటు హక్కు ఉంది. తనకు రెండు చోట్ల ఓటు హక్కు ఉందని వరంగల్‌లో తొలగించాలని సంబంధిత అధికారులకు విన్నవించింది. ఇంత వరకు తొలగించలేదని దంపతులిద్దరు తెలిపారు.

దరఖాస్తు చేయకున్నా ఓటు బదిలీ

వంగాల నరేంద్రచారి, పరకాల

పరకాలలోని స్థానిక 43వ పీఎస్‌లో నాకు ఓటు ఉండేది. ఓటు బదిలీ కోసం ఎలాంటి దరఖాస్తు చేయలేదు. కానీ నా ఓటు కాస్తా 56వ పీఎస్‌కు వెళ్లింది. ఎలా బదిలీ అయిందో అర్థం కావట్లేదు.

నా పేరు జాబితాలో తొలగించారు

అయిలవేన సంపత్, మాణిక్యాపూర్

నా వయస్సు 53 ఏళ్లు. నేను ప్రతి ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకుంటున్నాను. ఈ ఏడాది నా తల్లి మృతి చెందింది. ఆమె పేరు ఓటరు జాబితాలో నమోదు చేసి నా పేరు తొలగించారు.

ఒకే కుటుంబం.. పోలింగ్ బూత్‌లు వేరు

హనుమకొండలోని రెవెన్యూకాలనీలో 1-77-425 ఇంటి నంబర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులకు ఓటు హక్కు ఉంది. అయితే వారి ఇంటికి సమీపంలోని ఆర్ట్స్ కళాశాలలోని పోలింగ్ బూత్‌లో ఐదుగురు ఓట్లు ఉండగా, ఇంటి యజమాని ఆరవెల్లి శ్రీకాంత్ ఓటు మాత్రం కిలో మీటరు దూరంలో కాజీపేట రహమ్మత్ నగర్‌లో ఉంది. తన ఓటును సైతం ఆర్ట్స్ కళాశాలకు మార్చాలని ఆయన కోరుతున్నారు.

చనిపోయినా... తొలగింపు లేదు

పరకాలకు చెందిన ఇల్లందుల కోటేశ్వర్ సుమారు ఎనిమిది నెలల కిందట మృతి చెందినారు. ఓటర్ల జాబితా నుంచి ఆయన ఓటును తొలగించాల్సి ఉంది. తొలగింపు లేకపోవడంతో స్థానిక 43వ పీఎస్‌లో ఇంకా ఓటు అలానే ఉంది. చనిపోయిన వ్యక్తికి ఓటు ఉంచడం పట్ల విమర్శలు వెలువడుతున్నాయి.

ఓటర్లు ఉన్నారు. జాబితా సవరణలో పలు తప్పులు దొర్లాయి. మృతుల పేర్లు తొలగించలేదు. చింతలపల్లి గ్రామానికి చెందిన ఓ యువకుడి పేరు ఇందిరానగర్ గ్రామంలో నమోదైంది. తహసీల్దార్ జగత్‌సింగ్‌ను వివరణ కోరగా ఇప్పటికి సుమారు 500 మందికిపైగా మృతి చెందిన వారిని తొలగించాం, సుమారు 50వరకు తొలగించాల్సి ఉందన్నారు.

ఇటీవల ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా తప్పులతడకగా ఉంది. బీఎల్వోల క్షేత్రస్థాయిలో పరిశీలన నామమాత్రంగా ఉండటంతో కొన్ని గ్రామాల్లో చనిపోయిన వారికీ జాబితాలో ఓట్లు ప్రత్యక్షమయ్యాయి. మరికొన్ని చోట్ల పలువురు రెండు ప్రాంతాల్లో ఓటర్లుగా నమోదై ఉన్నారు. శంభునిపల్లి గ్రామంలో ఓటరు జాబితాను పరిశీలించగా ఏళ్ల క్రితం చనిపోయిన వారి పేర్లు జాబితాలో ఉన్నాయి. దీంలో బీఎల్వోల నిర్లక్ష్యం మరోసారి నిరూపితమైంది. ఇరుపాల రాజేశ్వర్‌రావు, గోనెల మురళి, భవాని లింగయ్య, ఇలా చాలా మంది మృతుల పేర్లు జాబితాలో మళ్లీ ప్రచురితమయ్యాయి. కమలాపూర్‌లోని కొందరు ఓటర్ల వయస్సు 123 సంవత్సరాలుగా నమోదైంది. దీంతో బాధితులు రెవెన్యూ అధికారులను సంప్రదించారు. అధికారులు సవరించి పంపామని బదులిచ్చినట్లు తెలిసింది.

# దస్తావేజుకో ధర.. మారని అవినీతి పరంపర

పెద్దపల్లి: పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది వ్యవహార శైలి తరచూ వివాదాస్పదమవుతోంది. కార్యాలయంలో ఫ్రాంకింగ్ యంత్రాలు పని చేయకపోవడం.. బాండు పేపర్లు అందుబాటులో లేకపోవడం.. క్రయ విక్రయాలు స్టాంపులపైనే మ్యానువల్‌గా జరుగుతుండటం పరిపాటిగా మారింది. చివరికి వివాహ రిజిస్ట్రేషన్ పత్రం ఇవ్వాలన్నా అడిగినంత డబ్బులు చెల్లించాల్సిందేనని డిమాండ్ చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఈ కార్యాలయ అధికారులు ఏసీబీ దాడుల్లో పట్టుబడినా ఇప్పటికీ మార్పు రావడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు

పెద్దపల్లి శాంతినగర్‌కు చెందిన న్యాయవాది, దస్తావేజు లేఖరి కల్లెపల్లి కిష్టయ్య, సుల్తానాబాద్ మండలం తొగర్రాయికి చెందిన సుద్దాల సతీశ్, మానస దంపతులు ఏకంగా పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ సురేశ్‌బాబుపై కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. సెప్టెంబరు 29న కార్యాలయంలో వివాహ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశామని, వారం రోజుల తర్వాత సర్టిఫికెట్ కోసం కార్యాలయంలో సంప్రదిస్తే ఫీజు సక్రమంగా చెల్లించలేదంటూ రిజిస్ట్రార్ దరఖాస్తును చింపివేశారని దంపతులు ఫిర్యాదులో పేర్కొన్నారు. 2018లో వివాహం జరిగితే అయిదేళ్లు దాటిన రిజిస్ట్రేషన్ ఎందుకు చేసుకుంటున్నారు? ఏం అవసరం? ప్రశ్నలు వేసి డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపిం చారు. అడిగినంత ఇవ్వకపోవడంతో పత్రాలు చింపేశారని ఆరోపించారు. పంచాయతీల పరిధిలో గృహాలకు ఇంటి నెంబర్‌లతో రిజిస్ట్రేషన్ కావాలంటే పెద్దపల్లి కార్యాలయ సిబ్బంది చెప్పిందే ధరగా మారింది. 200 గజాల్లోపు రూ.10 వేలు, 200 నుంచి 350 గజాల్లోపు ఉంటే రూ.25 వేలు, ఆ పై వాటికి డిమాండ్‌ను బట్టి అక్రమంగా వసూలు చేస్తున్నారని విమర్శలున్నాయి.

సాధారణంగా రిజిస్ట్రేషన్ కోసం దస్తావేజు లేఖరుల ద్వారా డాక్యుమెంట్లు సిద్ధం చేసి కార్యాలయానికి సమర్పిస్తుంటారు. ఈ క్రమంలో డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత సబ్‌రిజిస్ట్రార్, సిబ్బంది సూచించిన 'ధర'ను లేఖరులు దస్తావేజులపై ప్రత్యేకంగా రోమన్, ఆంగ్ల అక్షరాలతో కోడ్‌లు రాస్తున్నారు. ఆ మేరకు సొమ్ము అప్పగిస్తేనే డాక్యుమెంట్ చేతికొస్తుంది.

అన్ని ఆరోపణలకూ సమాధానమిస్తా

సతీశ్ అనే వ్యక్తి సెప్టెంబర్ 29న వివాహ రిజిస్ట్రేషన్ కోసం భార్య, కూతురుతో కలిసి దరఖాస్తు చేశారు. మా సిబ్బంది మానవతా దృక్పథంతో ఫీజు కట్టకముందే ఫొటోలు దింపారు. అనంతరం ఇప్పుడే ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించి వస్తామని చెప్పిన దంపతులు తిరిగి రాలేదు. అనంతరం మూడు రోజుల తర్వాత వచ్చి 'రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాం, వెంటనే డాక్యుమెంట్ ఇవ్వాల'ని అడిగారు. వాస్తవానికి దరఖాస్తు చేసిన రోజే ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆలస్యంగా రావడంతోనే మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయాలని సూచించాను. రిజిస్ట్రేషన్ ఫీజు కట్టనిదే డాక్యుమెంట్ ఇవ్వరు. దాన్ని చింపివేశాననడం పూర్తిగా అవాస్తవం. దస్తావేజు లేఖరి, దంపతులు ఉద్దేశపూర్వకంగానే నాపై ఫిర్యాదు చేశారు. వారి ఆరోపణలకు సమాధానం ఇస్తాను. సురేశ్‌బాబు,పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్

# గ్రంథాలయం.. కొలువుల దేవాలయం

మిర్యాలగూడ : ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా యువత సాధనకు ప్రయత్నాలు సాగిస్తుంటారు. ఆర్థికంగా లేని పేద యువతకు గ్రంథాలయాలు ఆసరాగా నిలిచి వారి లక్ష్యానికి మార్గంగా నిలుస్తున్నాయి. ఉద్యోగ సాధనకు కావాల్సిన పుస్తకాలు కొనలేని వారికి గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయి. ఈక్రమంలో ఉమ్మడి జిల్లాలోని నల్గొండ, సూర్యాపేట, భువనగిరి జిల్లా గ్రంథాలయాలతో పాటు మిర్యాలగూడ మేరెడ్డి రాంచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో చదివి ఉద్యోగాలు సాధిస్తున్నారు.

మెరుగైన సౌకర్యాలు..వరుస ఉద్యోగ నోటిఫికేషన్ల నేపథ్యంలో ప్రధాన గ్రంథాలయాల్లో సుమారు 400 మందికి పైగా ప్రతి రోజూ చదువుతున్నారు. వీరికి ఆయా ప్రాంత ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధుల సహకారంతో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రంథాలయ అధికారులు కృషి చేస్తున్నారు. ఉద్యోగార్థులు కోరిన పుస్తకాలను వేలాది సంఖ్యలో సమకూర్చారు. సమయపాలన కంటే అధిక సమయం గ్రంథాలయాలను తెరుస్తూ.. అభ్యర్థులకు సహకారం అందిస్తున్నారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో సత్తా..ఇటీవల వెల్లడించిన కానిస్టేబుల్ ఫలితాల్లో నల్గొండ జిల్లాలో 60, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో 30 మంది చొప్పున గ్రంథాలయాల్లో చదివి ఉద్యోగాలు సాధించారు. రానున్న గురుకుల ఫలితాల్లోనూ సత్తా చాటనున్నట్లు గ్రంథాలయాల్లో సన్నద్ధమవుతున్న అనేక మంది అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా వందల సంఖ్యలో ఉద్యోగాలు సాధించిన ఘనత గ్రంథాలయాలకు ఉంది.

కొలువు సాధించానూకపంగ పవన్‌కుమార్, గూడూరు, మిర్యాలగూడ మండలం.ఎంఏ బీఈడీ పూర్తి చేశా. కానిస్టేబుల్ ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా ఏడాది నుంచి నిత్యం 10 గంటల పాటు మిర్యాలగూడలోని ప్రభుత్వ గ్రంథాలయంలో చదువుతున్నా. మౌలిక వసతులతో పాటు పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఎన్బీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యం నాలుగు గంటల పాటు వ్యాయామం చేయడంతో పాటు.. సహాయ గ్రంథాలయ అధికారుల సూచనలతో ఉద్యో గాలు సాధించాం.నిరుద్యోగుల కల్పవల్లి సీహెచ్.ఎల్.ఎన్.రెడ్డి, గ్రంథాలయ అధికారి, మిర్యాలగూడ.మిర్యాలగూడలోని మేరెడ్డి రాంచంద్రారెడ్డి స్మారక ప్రభుత్వ గ్రంథాలయం గత 13 ఏళ్లుగా నిరుద్యోగుల కల్పవల్లిగా మారింది. సుమారుగా 400 మంది చదువుతూ.. వివిధ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు.

# వరి తడారె.. పత్తి గూడ రాలె

సూర్యాపేట : వర్షాల లేమి, చీడపీడల బెడద జిల్లాలో రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంత ఈసారి వీటి ప్రభావం పెరగడంతో పంటల దిగుబడి తగ్గి పెట్టిన పెట్టుబడి వచ్చే అవకాశం లేదని దిగులు చెందుతున్నారు. ఇటు కోతులు పంటలను దెబ్బతీస్తుండటంతో పండ్ల తోటలు, కొద్దిపాటి నీటితో పండే కూరగాయలు, అపరాల సాగు చేసే సాహసం చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలో అధికంగా వరి, పత్తి, మిర్చి సాగు చేస్తుండగా.. వర్షం లోటు వీటిపై అధిక ప్రభావం చూపింది. ఏ పంట చూసినా ఆశించిన మేర దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాలో 7.78 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షపాతంతో దెబ్బతింది. నీటి వసతి, వర్షాలు లేకపోవడంతో పంట ఎదుగుదల లోపించింది. మంచిగా ఉన్న పత్తి కూడా చీడపీడల కారణంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉండటంతో పురుగు మందులు చల్లి కాపాడుకుంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం మొదటి విడత పత్తి తీత మొదలు పెట్టేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు గూడ రాలుతోందని దిగులు చెందుతున్నారు. పంటకు మద్దతు ధర తక్కువగా ఉందని, ప్రభుత్వం స్పందించి ధర పెంచాలని వేడుకుంటున్నారు.

మిర్చికి తెగుళ్లు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 74 వేల ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. విత్తనాలలో నాణ్యత లోపించడం కారణంగా మొక్కల్లో ఎదుగుదల లేక ఇప్పటికే నష్టం వాటిల్లుతోంది. నీటి తడులు అధికంగా అవసరం ఉంటుండటంతో కరెంటు ఎప్పుడొస్తుందో తెలియక నీటిని కట్టలేతున్నామని రైతులు చెబుతున్నారు. నీటి కొరత కారణంగా మిర్చికి తెగుళ్లు అధికంగా సోకుతోందని, పూత దశలో అధికంగా రాలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు. మిర్చికి అధికంగా మందులు చల్లాల్సి ఉంటుందని, కూడా వచ్చే పరిస్థితి లేదని పేర్కొంటున్నారు.

# ఓఅండ్ఎం నుంచి ఎస్పీఎఫ్ సిబ్బంది తొలగింపు..!

పాల్వంచ : రాష్ట్ర జెన్కో యాజమాన్యంలో నిర్వహిస్తున్న విద్యుత్తు కర్మాగారాల్లో తరచూ చోరీ ఉదంతాలు వెలుగుచూస్తున్నాయి. విలువైన అల్యూమినియం, రాగి, ఇనుప పైపులు, ప్లేట్లు, తీగలు, ఫ్యాన్లు మొదలైన వాటిని కొందరు నిఘా కళ్లు గప్పి బయటకు తరలిస్తున్నారు. గతంలో పలు చోరీ ఘటనల్లో స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) సిబ్బంది పాత్ర బహిర్గతమైంది. 2020 జులై నుంచి విద్యుత్కేంద్రాల్లో టీఎస్ జెన్కో విజిలెన్స్ కమిటీ పర్యవేక్షణ మొదలైంది. కొన్నాళ్ల పాటు ఎస్పీఎఫ్, విజిలెన్స్ కమిటీ సంయుక్తంగా చోరీలపై విచారణ చేపట్టాయి. అయినా తరచూ ఏదోచోట చోరీలు పునరావృత మయ్యేవి. తాజాగా ఓఅండ్ఎం కర్మాగారాన్ని కూల్చివేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఇక్కడ రూ.100 కోట్ల విలువైన సొత్తు ఉండటంతో చోరీలపై కట్టుదిట్టమైన చర్యల్లో భాగంగా ఎస్పీఎఫ్‌కు సంబంధం లేకుండా టీఎస్ జెన్కో సెక్యూరిటీ బలగాలతో పాటు హోంగార్డులను కేటాయించటం గమనార్హం.

నేటి నుంచి బదిలీ.. టీఎస్ జెన్కో పరిధిలోని కేటీపీఎస్ విద్యుత్కేంద్రంలో 242 మంది ఎస్పీఎఫ్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) కర్మాగారంలో 88 మంది పనిచేస్తున్నారు. వీరి బదిలీ సోమవారం నుంచి జరగనుంది. మణుగూరు బీటీపీఎస్‌కు 48 మందిని కేటాయించారు. అసిస్టెంట్



కమాండెంట్ రవీందర్‌రెడ్డి, ఆర్ఐ, నలుగురు ఎస్సైలు, నలుగురు ఏఎస్సైలు, పదకొండు మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 27 మంది కానిస్టేబుళ్లకు ఓఅండ్ఎం నుంచి బీటీపీఎస్‌కు స్థానచలనం కలగనుంది. నల్గొండలోని వైటీపీఎస్‌కు 85 మంది వెళ్లనున్నారు. అసిస్టెంట్ కమాండెంట్ బాబురావు, ఇద్దరు ఆర్ఐలు, నలుగురు ఎస్సైలు, తొమ్మిది మంది ఏఎస్సైలు, 19 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 50 కానిస్టేబుళ్లకు వైటీపీఎస్‌కు స్థానచనలం కలగనుంది. వీరితో పాటు పదకొండు మంది వివిధ కారణాలతో ఇతరచోట్లకు బదిలీ కానున్నారు. పాల్వంచలో మూతపడ్డ ఓఅండ్ఎం కర్మాగారానికి కేవలం టీఎస్ జెన్కో సెక్యూరిటీ గార్డులతో పాటు హోంగార్డులు 46 మంది రానున్నారు. ప్లాంట్ భద్రతను పర్యవేక్షించనున్నారు.

బీటీపీఎస్, వైటీపీఎస్‌కు ఎస్పీఎఫ్ సిబ్బందిని బదిలీ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఓఅండ్ఎం కర్మాగారంలో ఇకనుంచి ఎస్పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షణ ఉండదు. సోమవారం నుంచి ఆయా ప్లాంట్లకు సంబంధిత ఉద్యోగులు వెళ్లనున్నారు. బీటీపీఎస్ నుంచి పాల్వంచ కేటీపీఎస్‌కు 46 మంది జెన్కో సెక్యూరిటీ, హోంగార్డులు రానున్నారు.

అప్పాజీ, పాల్వంచ కేటీపీఎస్‌అసిస్టెంట్ కమాండెంట్, ఎస్పీఎఫ్

# మళ్లీ సమగ్రంగా.. పారదర్శకంగా..!

భద్రాచలం : భద్రాచలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) వెబ్‌సైట్ మళ్లీ తెరపైకి వచ్చింది. సమాచారం పూర్తిస్థాయిలో అందరికీ అందుబాటులోకి రానుంది. పీఓ ప్రతీక్ జైన్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియలో సిబ్బంది తలమునకలయ్యారు. నాలుగేళ్ల క్రితం అప్పటి పీఓ వీపీ గౌతమ్ వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసేవారు. మన్యం పరిధిలోని అన్ని శాఖల సమాచారం వెబ్‌సైట్ లో ఉండేది. వీపీ గౌతమ్ ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో ఇక్కడ పీఓగా పోట్రు గౌతమ్ బాధ్యతలు స్వీకరించారు. ఈయన మూడేళ్ల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించినా వెబ్‌సైట్ ఆధునికీకరణపై దృష్టి సారించలేదు. పోట్రు గౌతమ్ సెర్ప్ సీఈఓగా బదిలీపై వెళ్లటంతో ఇక్కడి ప్రాజెక్ట్ అధికారిగా ప్రతీక్ జైన్ కొన్నాళ్ల క్రితం బాధ్యతలు చేపట్టారు. ఐటీడీఏ వెబ్‌సైట్ పునరుద్ధరణకు పూనుకున్నారు.

ఈ–ఆఫీస్ అందుబాటులోకి వచ్చేనా..?

నాలుగేళ్ల క్రితం కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు ఎక్కువ శాతం ఎలక్ట్రానిక్–ఆఫీస్‌లో జరిగేవి. ప్రతి సోమవారం దర్బారుకు వచ్చే దరఖాస్తులను ఇందులో పొందుపర్చేందుకు అప్పట్లో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పీఓ ఎప్పటికప్పుడు కంప్యూటర్ ద్వారా దస్త్రాలను పరిశీలించే వెసులుబాటు ఉండేది. ఈ ప్రక్రియ చాలాకాలంగా మందగించింది. ఈ–ఆఫీస్ అనేది వెబ్‌సైట్‌కు సంబంధం లేనప్పటికీ అంతర్గతంగా ఆన్‌లైన్ సేవలు ఉపయోగించేవారు. ఒక విభాగం నుంచి మరో విభాగానికి సులువుగా దస్త్రాల బదలాయింపు జరిగేది. ప్రస్తుత అవసరాల రీత్యా ఈ–ఆఫీస్‌ను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

వెబ్‌సైట్ ద్వారా ఒనగూరే ప్రయోజనాలు

గిరిజన సంక్షేమశాఖ పథకాల సమగ్ర సమాచారం ఒకేచోట లభ్యమవుతుంది. ప్రగతి నివేదికల్లో తాజాదనంతో పాటు పారదర్శకతకు ప్రాధాన్యం దక్కుతుంది.

విద్యాశాఖ ప్రణాళికలు, ఫలితాలు పొందుపర్చనున్నారు. వైటీసీ ద్వారా అందిస్తున్న శిక్షణలతో పాటు ఉపాధి పొందిన వారి జాబితాలు ఉంటాయి.

ఇంజినీరింగ్ విభాగం నిధులు, పనుల ప్రగతిని తెలుసుకోవచ్చు. వీటి ఆధారంగా ఉన్నతాధికారులు సులువుగా సమీక్షించవచ్చు.

మన్యంలో తరుణ వ్యాధుల నివారణకు వైద్యారోగ్య శాఖ తీసుకునే జాగ్రత్తల గురించి తెలుసుకోవచ్చు.

అటవీ హక్కుల చట్టం పరిధిలో ఎంతమందికి ఎన్ని ఎకరాల పట్టాలు జారీ చేశారో స్పష్టంగా నమోదు చేయనున్నారు.

ట్రైకార్ పథకంలో లబ్ధిదారుల జీవన విధానంలో వచ్చిన మార్పులను వెల్లడించడానికి ఇదో చక్కని మార్గంగా మారనుంది.

ఈ మధ్యకాలంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కింద మహిళలను ప్రోత్సహిస్తున్నారు. వీరి విజయాలను ప్రచారం చేసేందుకు వెబ్‌సైట్ వేదిక కానుంది.

గిరిజన ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ద్వారా యువ పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దుతున్నారు. వీరి వ్యాపార సరళిని ఇందులో పొందుపరచవచ్చు.

# తపాల సేవలకు జవసత్వాలు



ఖమ్మం : ఆధునికత ఎంతగా దూసుకెళ్తున్నా నేటికి గ్రామీణ ప్రాంతాల్లోని వారు తపాలా సేవలవైపే చూస్తున్నారు. చిట్టచివరి ప్రాంతాలకు ఏదైనా పథకం చేరాలంటే అందుకు తపాలా తోడ్పాటు ఉంటోంది. అలాంటి ప్రభుత్వ శాఖ కొన్నేళ్లుగా బ్యాంకు రూపం దాల్చి ఆధునిక పద్ధతుల్లో సేవల్లో వేగం పెంచింది. ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం పట్టణాల్లో మూడు ప్రధాన కార్యాలయాలున్నాయి. వీటి పరిధిలో 70 ఉప, 750 గ్రామీణ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఈ యంత్రాంగం మొత్తాన్ని ఖమ్మం గాంధీ చౌక్‌లో ఉన్న డివిజన్ కార్యాలయం పర్యవేక్షిస్తోంది.

అతిపెద్ద డివిజన్

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లోనే ఖమ్మం తపాలా డివిజన్ పెద్దది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లోనూ ఈ డివిజన్ పరిధిలోని గ్రామీణ కార్యాలయాలు ఉన్నాయి.

పెద్ద చరిత్ర: ఇక్కడి తపాలా శాఖకు పెద్ద చరిత్ర ఉంది. 1885లో కాటన్ బ్యారేజి నిర్మాణ సమయంలో అక్కడి అవసరాల నిమిత్తం భద్రాచలం సమీపంలో దుమ్ముగూడెం ఉప, గంగోలు గ్రామీణ తపాలా కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచే తపాలా వ్యవస్థ విస్తరించింది. 1960లో ఖమ్మం ప్రధాన కార్యాలయం, 1972లో ఖమ్మం తపాలా డివిజన్ ఏర్పాటు, 1979లో భద్రాచలం, 1980లో కొత్తగూడెం ప్రధాన తపాలా కార్యాలయాలు ఏర్పాటు జరిగింది. 2 వేల జనాభాకు ఓ తపాలా కార్యాలయం, ఒక్కో కార్యాలయానికి కనీసం దూరం 3 కిలో మీటర్లు ఉండాలనే నిబంధన ప్రకారం కార్యాలయాల ఏర్పాటు కొనసాగుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో పొదుపు అలవాటు చేసేందుకు నిబంధనలు సడలించి ఏర్పాటు చేశారు.

మారిన స్వరూపం: అయిదేళ్లలో తపాలా శాఖ స్వరూపమే మారింది. 2018లో తపాలా బ్యాంకు అమల్లోకి వచ్చింది. ఇందుకు తోడు డిజిటల్ విధానాన్ని బలోపేతం చేశారు. డివిజన్లో 730 గ్రామీణ డాక్ సేవక్‌లకు అత్యాధునిక 5జీ దర్పణ్ ఆండ్రాయిడ్ ఫోన్లు అందించారు. 2018 నుంచి ఖమ్మం ప్రధాన కార్యాలయంలో పాస్‌పోర్టు సేవలు సైతం అందుబాటులోకి వచ్చాయి.

ఆధునిక పోకడలు: తపాలా బ్యాంకు చేపట్టిన ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ విధానంలో ఖాతాలతో సంబంధం లేకుండా ఆధార్ కార్డుతో ఇతర ఖాతాలో ఉన్న నగదును వినియోగదారుడికి అందిస్తున్నారు.

శాశ్వత ఆధార్ కేంద్రాలు: మీసేవా కేంద్రాల వద్ద గంటల తరబడి ఇబ్బందులు పడకుండా.. నేరుగా తపాలా కార్యాలయాల్లో ఆధార్ నమోదు, అప్‌డేట్ చేయడం, తదితర సేవలను ఉప తపాలా కార్యాలయాల్లో అందుబాటులోకి తెచ్చారు. వారంలో నాలుగు రోజులు సబ్ ఆఫీసులో ఉంటే రెండు రోజులు బ్రాంచి కార్యాలయాల్లో ఇవి పని చేస్తాయి. దీంతో దూర భారం తగ్గుతోంది.

బ్యాంకులుగా రూపాంతరందేశంలో అతిపెద్ద నెట్‌వర్కు తపాలా శాఖకు ఉంది. దీని ద్వారా కొత్త రూపాలకు మారే ఆలోచన చేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో రుణ సదుపాయం కల్పించే ఆలోచనా ఉంది. ఎలా అమలు చేయాలి? వసూళ్లు ఎలా? అనే అంశాలపై కసరత్తు జరుగుతోంది.

ఎస్‌డీఐపీ ప్రవీణ్‌కుమార్

# ఆసరా దక్కదాయె!



ఖమ్మం :కామేపల్లి మండలం జాస్తిపల్లికి చెందిన మేకల కార్తీక్‌కు ఆరేళ్లు. ఏడాదిగా కంటి సమస్యతో బాధపడుతున్నాడు. ఈ ఏడాది మార్చి నెలలో సదరం శిబిరంలో నలభై శాతం కంటి సమస్య ఉన్నట్లు నిర్ధారించి ఏడాది కాల పరిమితితో వైకల్య ధ్రువపత్రం జారీ చేశారు. దాని సాయంతో పింఛను కోసం దరఖాస్తు చేసుకుందామనుకుంటే సైట్ నిలిచిపోయింది. మరో అయిదు నెలలు గడిస్తే అతనికిచ్చిన ధ్రువపత్రం కాలం చెల్లిపోతుంది.కష్టకాలంలో ప్రభుత్వ 'ఆసరా' పొందటానికి దివ్యాంగులు పడరాని పాట్లు పడుతున్నారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడ్డవారు, అకస్మాత్తుగా నాడీ సంబంధ వ్యాధులకు గురైనవారు, ఇతరత్రా సమస్యలతో మంచమెక్కిన వారు అష్టకష్టాలు పడి తాత్కాలిక వైకల్య ధ్రువీకరణ పత్రాలు సాధించినా 'ఆసరా' పింఛను పొందటం ప్రహసనంలా మారింది. శాశ్వత వైకల్య ధ్రువపత్రం పొందిన వారికి ఒకనెల ఆలస్యమైనా తర్వాత పింఛన్ పొందే వీలుంది. కానీ తాత్కాలిక ధ్రువపత్రం పొందినవారిని గడువులోపు కరుణించకుంటే ఏ నెలకానెల ఆదరువు కోల్పోయినట్లే. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఇలాంటి బాధితులు వేలాది మంది ఉన్నారు.

సమస్య ఏంటి?

వైకల్య ధ్రువపత్రం పొందటంలో అతి కష్టమైన పని స్లాట్ బుకింగ్. సదరం శిబిరానికి హాజరయ్యేందుకు వీలు కల్పించే ఈ స్లాట్ కోసం దివ్యాంగులు అనేక పాట్లు పడుతున్నారు. నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. ప్రతినెలా పరిమిత సంఖ్యలో స్లాట్ నమోదుకు అవకాశం లభిస్తుండటంతో అది పొందటానికే తలప్రాణం తోకకు వస్తుంది. అంత కష్టపడి వైకల్య ధ్రువీకరణ పత్రం సంపాదించి ఎంపీడీఓ కార్యాలయాలకు వెళ్తే 'పింఛన్ దరఖాస్తు సైట్' తెరచుకోవటం లేదు. 2022 ఆగస్టులో సైట్ నిలిచిపోవడంతో ప్రధానంగా తాత్కాలిక వైకల్య బాధితులు ఇబ్బంది పడుతున్నారు. వారి ధ్రువపత్రం గడువు దాటితే మళ్లీ రెన్యువల్ చేయించుకోవటానికి ఎన్నో వ్యయ ప్రయాసలు పడాల్సి వస్తోంది. కొందరిలో వైకల్య శాతం తగ్గుతుండటంతో వైద్యులు రెన్యువల్‌కు ఆమోదం తెలపటం లేదు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే పొంతన లేని సమాధానాలు చెబుతూ దాటవేస్తున్నారు. కొన్నిచోట్ల విసుక్కుంటున్నారు.

టేకులపల్లి మండలం ఎర్రాయిగూడేనికి చెందిన కుంజా అచ్చయ్య–నిర్మల దంపతుల కుమారుడు పార్థుకు పదేళ్లు. అతని రెండు కాళ్లు, కుడి చేయి పనిచేయకపోవడంతో 2019లో సదరం శిబిరానికి హాజరయ్యారు. 90 శాతం మానసిక సమస్యగా గుర్తించి అయిదేళ్ల వ్యవధితో తాత్కాలిక వైకల్య ధ్రువపత్రం ఇచ్చారు. అవగాహన లేకపోవడంతో పింఛన్‌కు దరఖాస్తు చేసుకోలేదు. గతేడాది పంచాయతీ కార్యదర్శి చొరవ తీసుకుని ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించారు. సైట్ క్లోజ్ కావడంతో పింఛన్ మంజూరు కాలేదు. అతని ధ్రువపత్రానికి ఇంకో ఏడాది కాలపరిమితే ఉంది.

కామేపల్లి మండలం ముచ్చర్లకు చెందిన రాయల వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యానికి ఖర్చులయ్యాయి. గతేడాది సెప్టెంబరులో అయిదేళ్ల వ్యవధితో సదరం ధ్రువీకరణ పత్రం పొందాడు. ఏడాది దాటినా ఏ ప్రయోజనం లేదు.

పింఛన్ దక్కాలంటే..

దివ్యాంగులు ఆసరా పింఛన్ పొందాలంటే ముందుగా జిల్లా సర్వజన ఆసుపత్రుల్లో నిర్వహించే సదరం శిబిరాలకు హాజరు కావాలి. సమస్య తీవ్రతను బట్టి తాత్కాలిక/శాశ్వత వైకల్య ధ్రువపత్రం వైద్యులు ఇస్తారు. దాని సాయంతో బాధితులు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. కార్యాలయ సిబ్బంది సంబంధిత పింఛన్ సైట్‌లో వివరాలు ఆన్‌లైన్ చేస్తే 'ఆసరా' మంజూరవుతుంది.

తాత్కాలిక వైకల్య ధ్రువపత్రం పొందేదెవరు?

రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు,చేతులకు తీవ్రంగా గాయాలైనవారు.

పక్షవాతం బారినపడ్డవారు.

కంటి సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలతో మంచం పట్టినవారు.

కాల వ్యవధి?

వీరికి 1–5 ఏళ్ల కాల వ్యవధితో సదరం ధ్రువపత్రం ఇస్తున్నారు.

అన్ని అర్హతలు ఉంటేనే.. విద్యాచందన, డీఆర్డీవో, ఖమ్మం

తాత్కాలిక ధ్రువపత్రం పొందిన వారు కాలపరిమితి ముగిసిన తర్వాత మళ్లీ స్లాట్ బుక్ చేసుకుని పునరుద్ధరించుకోవాలి. సైట్ తెరుచుకోని దృష్ట్యా సమస్యకు బాధ్యులెవరని చెప్పలేం. సదరం తో పాటు అన్ని అర్హతలు ఉంటేనే పింఛన్ మంజూరవుతుంది.

# ప్రయోగశాలలు.. ఏర్పాటు చేస్తే చాలు..!

ఖమ్మం : పాలేరు జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో తొలి ఏడాది తరగతులు ఇటీవల ప్రారంభమయ్యాయి. బోధన, బోధనేతర సిబ్బందిని ప్రభుత్వం నియమించింది. ఇక ప్రయోగశాలల ఏర్పాటే మిగిలింది. బాలబాలికలకు వేర్వేగా వసతిగృహ సదుపాయం పాలేరు జేఎన్టీయూ కళాశాలను ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలోని వైటీసీ భవనంలో నిర్వహిస్తున్నారు. తొలుత బారుగూడెంలోని ఓ ప్రైవేటు యంత్రవిద్య కళాశాలలో ఏర్పాటు చేసినా ఇబ్బందులు తలెత్తడంతో మద్దులపల్లిలోని వైటీసీ భవనంలోకి మార్చారు. ఇక్కడ రెండో అంతస్తులో కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కళాశాలకు నాలుగు గదులు కేటాయించారు. అవసరం మేరకు మళ్లీ గదుల కేటాయింపు ఉంటుంది. ప్రస్తుతం భవనంలో అనేక గదులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. బాలురు, బాలికలకు వేర్వేరుగా వసతిగృహ సదుపాయం కల్పించారు. 49 మంది విద్యాభ్యాసంకళాశాలలో ప్రస్తుతం మొదటి ఏడాదిలో సీఎస్ఈలో 41, సీఎస్‌డీ (డేటాసైన్స్)లో ఎనిమిది మంది మొత్తమ్మీద 49 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. వీరిలో బాలురు 38 మంది, బాలికలు పదకొండు మంది ఉన్నారు.రెగ్యులర్ ప్రిన్సిపల్ ఒకరు ఉండగా, ఐదుగురు అతిథి అధ్యాపకులను నియమించారు. బోధనేతర సిబ్బంది (అవుట్ సోర్సింగ్‌లో) ముగ్గురు ఉన్నారు.కళాశాలకు కంప్యూటర్ ల్యాబ్, కెమెస్ట్రీ ల్యాబ్, డ్రాయింగ్ ల్యాబ్ అవసరం.ఈ కళాశాలలో బోధించేందుకు కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకుల నియామకం కోసం నోటిఫికేషన్‌ను విశ్వవిద్యాలయం ఇటీవల జారీ చేసింది. త్వరలోనే ఒప్పంద పద్ధతిలో అధ్యాపకుల నియామక ప్రక్రియ పూర్తయ్యే అవకాశముంది.ల్యాబ్‌ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. ఈనెల చివరి నాటికి కంప్యూటర్ ల్యాబ్, డ్రాయింగ్ ల్యాబ్ ఏర్పాటు ప్రక్రియ పూర్తవుతుంది.

# తారు వేశారా.. పూశారా

వరంగల్ : ఓ వైపు మారుమూల గ్రామాలు, గిరిజన తండాలకు సైతం పక్కా రహదారి సౌకర్యం కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తోంది. మరోవైపు గుత్తేదారుల లాభాపేక్ష, పర్యవేక్షణ లేని అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేసిన రోడ్లు మూన్నాళ్లకే ధ్వంసం అవుతున్నాయి. నాసిరకం పనుల కారణంగా బీటీ లేచిపోయి కంకర తేలి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నర్సంపేట డివిజన్ పరిధిలోని పలు గ్రామాలు, తండాలకు రెండు నెలల కిందట వేసిన రోడ్లు అప్పుడే దుస్థితికి చేరాయి.

ఇదీ పరిస్థితి..

నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లి పంచాయతీరాజ్ రోడ్డు నుంచి లైనుతండా మీదుగా గోవిందాపురం వరకు ఐటీడీఏ మంజూరు చేసిన రూ.2.24 కోట్ల నిధులతో 3.200 కి.మీ. బీటీ రోడ్డు వేశారు. రెండు నెలలకే బీటీ మొత్తం పోయి కంకర తేలి, రోడ్డు గుంతలమయంగా మారింది. ఇంజినీరింగ్ అధికారులు చేసిన డ్రాఫ్ట్ డిజైన్ మేరకు రోడ్డు తవ్వి, గ్రౌండ్ సబ్ బేస్‌ను నిర్ణీత సైజు కంకర, చిప్స్, కంకర దుమ్ము



పొరలుగా వేస్తూ నీళ్లు చల్లుతూ రోలింగ్ చేయించాలి. ఈ ప్రక్రియ అనంతరం 15–20 రోజులకు ఇంజినీర్లు సూచించిన సైజు కంకర, డస్ట్, తారు కలిపిన మిశ్రమం వేస్తూ రోలింగ్ చేయిస్తూ రోడ్డు నిర్మించాలి. నిబంధనలకు విరుద్ధంగా భూమిలో తేమ ఉన్న సమయంలోనే సబ్ బేస్ నుంచి సరిగా రోలింగ్ చేయకుండా రోడ్డు వేయడం, పనుల్లో నాణ్యతను పాటించకపోవడంతోనే రోడ్డు అధ్వానంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. పట్టుమని 60 రోజులు గడిచాయో లేదో అప్పుడే ఎక్కడికక్కడ ధ్వంసం కావడం పనుల్లో నాణ్యతను వెక్కిరిస్తోంది.

మళ్లీ రోడ్డు వేయిస్తాం..

చందర్‌రావు, ఏఈ, ఏటూరునాగారం ఐటీడీఏ

మూడుచెక్కలపల్లి, లైన్‌తండా బీటీ రోడ్డు నాణ్యతగా లేని విషయం మా దృష్టికి వచ్చింది. బీటీపోయి రోడ్డు గుంతలు పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. వర్షాకాలం సీజన్ ముగిశాక రోడ్డు వేయాలని చెప్పినా గుత్తేదారు వినిపించుకోలేదు. ఇప్పటి వరకు దానికి బిల్లు మంజూరు చేయలేదు. మళ్లీ రోడ్డు నిర్మించాకే బిల్లులు చెల్లిస్తాం.

# టీ హబ్‌కు జబ్బు..

ములుగు: ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని రోగ నిర్ధారణ కేంద్రానికి(టీహబ్) జబ్బు చేసింది. నమూనాల పరిశీలన యంత్రం చెడిపోయి సుమారు పది రోజులు కావస్తోంది. ఆసుపత్రి యాజమాన్యం తాత్కాలికంగా తక్కువ సామర్థ్యం ఉన్న యంత్రాన్ని అమర్చింది. కానీ రక్త పరీక్షల ఫలితాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. టీహబ్‌కు వచ్చిన రోగులు ఫలితాల కోసం గంటలసేపు వేచి ఉండాల్సి వస్తోంది. రోజుకు వందల సంఖ్యలో రక్త నమూనాలు వస్తుండడంతో రోగులు పడుతున్న ఇబ్బందులు ఇలా ఉన్నాయి.

5 పార్ట్ అనలైజర్ యంత్రం చెడిపోయింది..

ములుగు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేసిన 5 పార్ట్ అనలైజర్ చెడిపోయింది. ఈ యంత్రం పని చేసినప్పుడు రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏరోజు వచ్చిన రక్త పరీక్షల నమూనాలను ఆ రోజే ఫలితాలు ఇచ్చే వారు. దీని ప్రత్యేకత ఏమిటంటే రక్త నమూనాను అందులో అమర్చితే చాలు ఫలితాలన్నీ అదే విడుదల చేసి నివేదికలో పొందుపరుస్తుంది. యంత్రం చెడిపోయిన తర్వాత ఆసుపత్రి సూపరింటెండెంట్ 3 పార్ట్ అనలైజర్ యంత్రాన్ని తాత్కాలికంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని సామర్థ్యం తక్కువగా ఉండటంతో ఫలితాలను రెండు విధాలుగా నమోదుచేయాల్సి వస్తోంది. రెండో దశ వివరాలను సిబ్బంది కంప్యూటర్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. టీ హబ్‌కు రోజుకు వందల సంఖ్యలో నమూనాలు వస్తుండడంతో ఈప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీనికి తోడు ఇంటర్‌నెట్ సమస్య, విద్యుత్ సమస్యలు తోడై మరింత ఆలస్యానికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. మరోవైపు టీహబ్‌లో ఇద్దరు వ్యక్తులే పనిచేస్తుండటంతో రోజుకి వందకు మించి ఆన్‌లైన్‌లో నమోదు చేయలేకపోతున్నారు.

రోజుకు సుమారు 600 నమూనాలు వస్తున్నట్లు అంచనా..

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రోజుకు సుమారు 600 వరకు నమూనాలు వస్తున్నట్లు అంచనా.. వీటన్నింటికీ పరీక్షలు నిర్వహించాలి.



ఈక్రమంలో రోగి ప్రాణాపాయ స్థితిలో ఉంటే తక్షణమే వైద్యం అందించేందుకు పరీక్షల ఫలితాలు అందించాల్సి ఉంటుంది. జిల్లా నలుమూలల 14 ఆసుపత్రుల నుంచి రక్త నమూనాలు వస్తుంటాయి. ఇందులో ములుగు జల్లాఆసుపత్రితో పాటు వెంకటాపురం, ఏటూరునాగారం, మంగపేట, చుంచుపల్లి, కన్నాయిగూడెం, ఎదిర, వెంకటాపూర్, తాడ్వాయి, గోవిందరావుపేట, పస్రా, కొడిశల, రాయినిగూడెం, వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి నమూనాలు వస్తుంటాయి. ఏ రోజువి ఆరోజే పరీక్షలు చేసి ఫలితాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. లేకుంటే రోగులతో ఇబ్బందులే.

చైనా నుంచి పరికరం రావాలి..

ములుగు ఆసుపత్రి టీ హబ్‌లో 5 పార్ట్ అనలైజర్ యంత్రం చైనా నుంచి రావాల్సి ఉందని సమాచారం.. యంత్రం కోసం సిఫారసు చేసి అధికారులు ఎదురు చూస్తున్నారు. అది ఎప్పుడు వస్తుందో తెలియడం సమాచారం కరవు. తాత్కాలికంగా తక్కువ సామర్థ్యం ఉన్న యంత్రం ఏర్పాటు చేసినా.. అది ఫలితాలు ఇచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ ఆశించిన రీతిలో లేదు. సీజనల్ వ్యాధులతో ఒక్క ములుగు జిల్లా ఆసుపత్రికి రోజుకు సుమారు 500 మంది రోగులు వస్తున్నారు. ఇలా జిల్లాలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కూడా వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో టీ హబ్‌లో జరుగుతున్న పరీక్షలు ఏ మూలకు చాలడం లేదు. ఇంకా ఎన్ని రోజులు ఇబ్బందులు పడాల్సి వస్తుందో తెలియడం లేదు.

# పెరిగిన రేషన్ బియ్యం కోటా

కరీంనగర్ :ఉమ్మడి జిల్లాలో రేషన్ బియ్యం కోటా పెరిగింది. గతేడాది డిసెంబర్ వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి యూనిట్‌కు 10 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేశారు. ఆ తర్వాత ఆహారభద్రత చట్టం ప్రకారం ఈ ఏడాది డిసెంబర్ వరకు ఉచిత రేషన్ పంపిణీకి కేంద్రం నిర్ణయం తీసుకున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ వాటా కేటాయించలేదు. దీంతో గత డిసెంబర్ నుంచి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన విధంగా యూనిట్‌కు 5 కిలోలే పంపిణీ చేస్తూ వచ్చారు. ఈ నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వ వాటా కిలో చొప్పున కలిపి యూనిట్‌కు ఆరు కిలోలు పంపిణీ చేసేలా పౌరసరఫరాల శాఖ నుంచి డీలర్లకు ఆదేశాలు అందాయి.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

గత నెల వరకు ఉమ్మడి జిల్లాలో 9,79,968 కార్డులు ఉండగా 15,365.635 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేశారు. ఈ నెలలో 9,80,955 కార్డులు ఉండగా రాష్ట్ర ప్రభుత్వ వాటా యూనిట్‌కు కిలో చొప్పున కలిపి 18,046.218 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. అంటే ఈ నెలలో 2,680.583 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా పెంచి డీలర్లకు పంపించారు. ఇప్పటికే గోదాముల నుంచి 90 శాతం బియ్యం రేషన్ దుకాణాలకు చేరాయి.

ఈ నెలలో 90 శాతమే!

పోషకాలతో కూడిన బలవర్ధక బియ్యాన్ని కార్డులు, యూనిట్ల ఆధారంగా గోదాములకు పంపించారు కానీ.. గత నెలలో ఉమ్మడి జిల్లాకు కేటాయించిన సాధారణ బియ్యం కోటా 10 శాతం నిల్వలు పేరుకుపోయాయి. ఈ బియ్యాన్ని ఫోర్టిఫైడ్ రైస్‌తో కలిపి సర్దుబాటు చేసి డీలర్లకు పంపించారు. ఒక్క హుజూరాబాద్ ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము



లోనే నిల్వ ఉన్న 557.43 క్వింటాళ్ల సాధారణ బియ్యాన్ని ఈ నెలలో ఫోర్టిఫైడ్ రైస్‌తో కలిపి డీలర్లకు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా ఏప్రిల్ నుంచి పూర్తిస్థాయిలో బలవర్ధక బియ్యం పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా గత నెల స్టాక్ మిగిలి ఉండటంతో 90 నుంచి 95 శాతం మాత్రమే పంపిణీ కానుంది.

మే నుంచి వంద శాతం బలవర్ధక బియ్యంశ్రీకాంత్‌రెడ్డి, డీఎం, పౌరసరఫరాల సంస్థ, కరీంనగర్

ఈ నెల నుంచే వంద శాతం ఫోర్టిఫైడ్ రైస్ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. కానీ గతనెలలో కేటాయించిన 200 మెట్రిక్ టన్నుల సాధారణ బియ్యం గోదాముల్లో నిల్వ ఉంది. ఈ మిగులు బియ్యాన్ని ఈనెలలో సర్దుబాటు చేయక తప్పలేదు. అందుకే కరీంనగర్ జిల్లాలో 95 శాతం ఫోర్టిఫైడ్ రైస్‌తో పాటు కేవలం అయిదు శాతం సాధారణ బియ్యం రేషన్ దుకాణాలకు కేటాయించాం. ఈ నెలతో గోదాముల్లోని సాధారణ బియ్యం నిల్వలు పూర్తిగా అయిపోయాయి. వచ్చే నెల నుంచి వంద శాతం ఫోర్టిఫైడ్ రైస్ రేషన్ దుకాణాలకు ద్వారా పంపిణీ చేస్తాం.

# లక్ష్య సాధనలో విపణులు సఫలం

జగిత్యాల : జగిత్యాల జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులు గడచిన ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాన్నిదాటి ఆదాయాన్ని గడించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాలోని 13 యార్డులకు రూ.21.52 కోట్ల మార్కెట్ఫీజు వసూలు లక్ష్యాన్ని నిర్దేశించగా మార్చి నెలాఖరు వరకు రూ.26.22 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో దినుసుల బీటు, మామిడి మండీ, మిల్‌పాయింట్లు, పశువుల వారసంతలు, దిగుమతులు తదితరాలతో పాటుగా సివిల్ సప్లయిస్ ధాన్యం కొనుగోలు, ఇతర ఉత్పత్తుల ప్రభుత్వ సేకరణ ద్వారా ఆదాయం సమకూరింది. సన్నధాన్యం, పత్తి, మామిడి, నువ్వులు, మినుములు, సెనగలు, పెసలు, మక్కలు, అలసందలు తదితర ఉత్పత్తుల క్రయవిక్రయాలు మండీలతో పాటుగా గ్రామాల్లోనూ పెద్దఎత్తున సాగుతాయి. పలు ఉత్పత్తులను మధ్యవర్తులు కొన్నప్పుడు పూర్తిస్థాయిలో మార్కెటు ఫీజు (ఒక శాతం) వసూలు కావటం లేదు. జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి, ధర్మపురి, గొల్లపల్లి, మల్యాల తదితర కొన్ని యార్డుల్లోనే దినుసుల క్రయవిక్రయాలు సాగుతుండగా రాయికల్,



మేడిపల్లి, పెగడపల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కథలాపూర్, వెల్గటూరు తదితర యార్డుల్లోనూ నిరంతరం ఉత్పత్తుల సేకరణ జరిగేలా ఏర్పాట్లు చేయాలి. సారంగాపూర్ తదితరచోట్ల నూతన మార్కెట్ల ఏర్పాటు, అంతటా పూర్తిస్థాయిలో ఫీజు వసూలు, ఈనామ్‌ను విస్తరణ అవశ్యంగామారింది.కర్షకులకు మరిన్ని సేవలుప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారినిరుడు రూ.18.05 కోట్లురాగా ఈ సారి లక్ష్యాన్ని దాటి 121.88 శాతం ఆదాయం రావటం విశేషమే. యార్డుల్లో సేకరణతో పాటుగా ప్రభుత్వరంగ సంస్థలు, మిల్‌పాయింట్ల నుంచి మార్కెట్ ఫీజు రావటంతోనే లక్ష్యాన్ని దాటగలిగాము. యార్డుల ద్వారా మన్ని సేవలకు చర్యలు తీసుకుంటున్నాం.

# అధునాతన ఠాణాలు.. ఎన్నో ప్రత్యేకతలు




భూపాలపల్లి : మనకు తెలిసిన వారు ఇంటిని నిర్మించుకుంటే అలా వెళ్లి చూసొస్తాం.. గదులన్నీ పరిశీలించి వాటి ప్రత్యేకతలను తెలుసుకుంటాం.. జిల్లాలో మన భద్రత కోసం ఇటీవల ప్రారంభించిన అధునాతన ఠాణాల్లో సైతం ప్రత్యేకతలతో ఆకర్శిస్తున్నాయి.. ఏ ఏ గదులున్నాయి...? ఎలాంటి సౌకర్యాలున్నాయి...? పోలీసు సిబ్బందికి కాకుండా ఫిర్యాదుదారులకు ఏమైనా సౌకర్యాలు కల్పించారా..? అనే సందేహాలను తీర్చడంతో పాటు గదుల ప్రత్యేకతలపై ప్రత్యేక కథనమిది..రాష్ట్ర ప్రభుత్వం శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేస్తోంది. నేరాలను తగ్గించేందుకు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. స్నేహపూర్వక విధానంతో పాటు ప్రజలకు వారి సేవలు అందుబాటులో ఉండేందుకు అనేక సంస్కరణలు తీసుకొస్తోంది. అన్ని హంగులతో ఆకర్షణీయంగా నూతన ఠాణాల నిర్మాణాలు చేపడుతోంది. ఇటీవల జిల్లాలోని టేకుమట్ల, మొగుళ్లపల్లి, కాళేశ్వరం, పలిమెల మండలాల్లో ప్రతి ఠాణాకు రూ.2.5 కోట్ల చొప్పున కేటాయించి నిర్మించిన రక్షకభట నిలయాల నిర్మాణాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఠాణాల్లో అధునాతన సౌకర్యాలున్నాయి. పోలీసు సిబ్బందికే కాకుండా ఫిర్యాదుదారుల కోసమూ సౌకర్యాలు కల్పించారు. విశ్రాంతి గదులు, భోజనశాల, వాష్‌రూంలతో పాటు పోలీసు విధులకు అవసరమయ్యే ప్రతి విభాగానికి ప్రత్యేకంగా గదులు నిర్మించారు. నిరంతరం పునశ్చరణ కోసం పోలీసు సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక మందిరం.. సమావేశాలకు అనుకూలంగా ఉండే హాలు.. ఆయుధాగారం నిల్వ చేసే గదులతో పాటు నిందితుల కస్టడీ రూం.. రికార్డులు భద్రం చేసేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌తో పాటు ఎస్సైలు కూర్చునే గదులు నిర్మించారు. ఉమ్మడి జిల్లాలోనే ఎక్కడా లేనివిధంగా ఆయా మండలాల్లోని ఠాణాలు ఆదర్శంగా నిలిచేలా నిర్మాణం చేపట్టారు.

ఆహ్లాదంగా రిసెప్షన్..ఫిర్యాదుదారులు వచ్చి కూర్చునే రిసెప్షన్ ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. హాలులో కూర్చొని వారి సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఠాణాలోపలికి వెళ్లగానే ఎదురుగా రిసెప్షన్ కనిపిస్తోంది. ఇచ్చిన ఫిర్యాదులను రిసెప్షనిస్టు ఎస్‌హెచ్‌వోకి పంపిస్తారు. అనంతరం విచారణ అధికారిని నియమిస్తారు. ప్రజల వద్ద ఫిర్యాదులు స్వీకరించేందుకు పోలీసు సిబ్బంది ప్రత్యేకంగా 24 గంటలు అందుబాటులో ఉంటారు. అక్కడే విశ్రాంతి తీసుకోవడానికి అవసరమైన కుర్చీలు ఏర్పాటు చేస్తారు.

అన్ని హంగులతో వాష్‌రూంలు

ఫిర్యాదుదారులతో పాటు పోలీసుల కోసం అన్ని హంగులతో వాష్‌రూంలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఫిర్యాదుదారుల్లో మహిళలు, మహిళా సిబ్బందికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. విచారణకు వచ్చేవారు వాష్‌రూంలను వినియోగించుకోవచ్చు. ప్రత్యేకంగా పోలీసు అధికారులు ఠాణాలోనే ఉండాల్సి వచ్చినపుడు అక్కడే స్నానాలు చేసేందుకు గదులు కూడా ఉన్నాయి.

సమావేశాలకు ప్రత్యేక హాలు..

నిరంతరం మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కేసుల విచారణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేలా పునశ్చరణకు ప్రత్యేక శిక్షణ గది ఏర్పాటు చేశారు. పోలీసులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక హాలు నిర్మించారు. ఇదే గదిలో శాంతి కమిటీ సమావేశాలు.. ప్రజలు, ప్రజాప్రతినిధులతో అవసరమైన సమయంలో సమావేశాలు నిర్వహించేందుకు ఈ మందిరం అవసరం ఉంటుంది. పోలీసుల ఆధ్వర్యంలో పలు అవగాహన సదస్సులకు సైతం హాలును వినియోగించుకుంటారు.

విచారణకు ప్రత్యేక గది

నిందితులను విచారించేందుకు, పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ప్రత్యేక గది నిర్మించారు. సమీపంలోనే కేసులకు సంబంధించిన రికార్డులు భద్రపర్చేందుకు గదితో పాటు.. అదుపులోకి తీసుకున్న నిందితులను కస్టడీలో ఉంచేందుకు పక్కనే రెండు లాకప్‌లను ఏర్పాటు చేశారు.

# అన్నదాతలకు మరింత 'సహకారం'




వరంగల్ : ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) సేవలను మరింత విస్తరించేందుకు కొత్త జిల్లాల్లో ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాల వారీగా డీసీసీబీలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది. అయితే ఆర్‌బీఐ నిబంధనలు అడ్డుగా ఉండటంతో ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే రైతులు, సహకార సంఘాలకు మరింత చేరువగా సేవలు అందుతాయని సర్కారు భావిస్తోంది. ఈ మేరకు సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి జిల్లా కేంద్రంలో 102 ఏళ్ల క్రితం డీసీసీబీ ఏర్పాటైంది. అప్పటి నుంచి రైతులకు సేవలందించేందుకు అంచెలంచెలుగా బ్యాంకులను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు 27 శాఖలున్నాయి. 91 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉండగా, 2.50 లక్షల మంది సభ్యత్వం పొందారు. వీరికి కావాల్సిన పంట రుణాలతో పాటు వ్యవసాయ పరమైన ఇతర అవసరాలను సంఘాలతో పాటు బ్యాంకులు సమకూరుస్తున్నాయి. అన్నదాతలకు పంట రుణాలు, దీర్ఘకాలిక, వ్యాపార తదితర రుణాలు అందించాలంటే డీసీసీబీ అనుమతి తప్పనిసరి. సహకార సేవల విస్తరణ కోసం జిల్లాల వారీగా డీసీసీబీ ఏర్పాటు చేసే అవకాశం లేకపోవడంతో ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది. మరో వైపు దేశంలో దేశంలో అయిదేళ్లలో రెండు లక్షల నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ మరిన్ని సంఘాలు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. గ్రామానికో సంఘం పెట్టి రైతులకు 25 రకాల సేవలు అందించేలా చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. సంఘాలు పెరిగితే సభ్యత్వం పొందే రైతుల సంఖ్య పెరుగుతుంది.

# సగం మందికి సమస్యలే!

కరీంనగర్ : అనారోగ్య ఇబ్బందులను గుర్తించి.. ఆరోగ్యవంతంగా ఉండేందుకు 'ఆరోగ్య మహిళ' అండగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం గత నెల మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ప్రారంభించిన ఈ కార్యక్రమం నాలుగు వారాలు పూర్తి చేసుకుంది. జిల్లాలో కరీంనగర్‌లోని బుట్టిరాజారాంకాలనీ, చొప్పదండి, చల్లూరు ఆసుపత్రులలో ప్రతి మహిళా వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ప్రతి కేంద్రంలో సుమారు 200 మందికి తగ్గకుండా హాజరవుతున్నారు.

పరీక్షలు ఇలా..పీసీవోడీ, థైరాయిడ్, రక్తపోటు, మధుమేహం, గర్భాశయ సమస్యలు, హార్మోన్ల వంటి పలు రకాల వ్యాధులతోపాటు క్యాన్సర్, మెనోపాజ్ నిర్ధారణ పరీక్షలు ఇక్కడ చేస్తున్నారు. ఆ మూడు ఆరోగ్య కేంద్రాల్లో వీటిని చేపడుతున్నారు. రూమోగ్రామ్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు అవసరమైతే జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపిస్తున్నారు. పరీక్షల ఆధారంగా తగిన వైద్యం కూడా అందిస్తున్నారు. ఇవే కాకుండా సీబీపీ పరీక్షలు కూడా చేస్తున్నారు.

పొదుపు సంఘాల సహకారం నగరంతోపాటు పట్టణాల్లో మెప్మా, గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని మహిళా సంఘాల రిసోర్స్‌పర్సన్ల సహకారం తీసుకొని వారిని ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఒక్కో ఆర్పీ 20 మందికి తగ్గకుండా తీసుకురావాలనే నిబంధన విధించారు. బుట్టిరాజరాంకాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రానికి మెప్మా పీడీ రవీందర్ వచ్చి హాజరు శాతాన్ని పరిశీలించారు. వీరి కోసం ఆటోలు ఏర్పాటు చేసి తరలిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో వివరాలు నిక్షిప్తం..చికిత్స పొందేందుకు వచ్చిన వారి పేర్లను ముందుగా వారి ఆధార్‌కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీనికి ఆరోగ్య మహిళా యాప్‌ను ఉపయోగిస్తున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ప్రత్యేక విభాగం కూడా ఏర్పాటు చేశారు.



మాలాంటి వారికి ఉపయోగం

ఆరోగ్యపరంగా ప్రధాన సమస్యలు లేవు. పరీక్షలు చేయించుకుంటే ఏదైనా ఇబ్బంది బయట పడుతుందని చెప్పారు. పరీక్షలు చేశారు. బలానికి మందులు రాస్తున్నట్లు వైద్యులు తెలిపారు. మాలాంటి పేదలు, కూలీలకు ఇది ఉపయోగం. సహచరులతో కలిసి వచ్చాను.– ఇరుమల్ల సరోజ, చొప్పదండి

జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్సమూడు ఆసుపత్రులలో వ్యాధి నిర్ధారించిన వారికి సోమ, బుధ, శుక్రవారాలలో జిల్లా ప్రధాన దవాఖానాలో ప్రత్యేక చికిత్స అందిస్తాం. ఇప్పటివరకు 109 మందిని పంపించాం. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమ వాహనంలో మగువలను ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్తారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులతోపాటు అదనంగా మరికొందరు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తారు.

– డాక్టర్ వినీత, కార్యక్రమ ఇన్‌ఛార్జిభారం తగ్గినట్లే..

ఆరు నెలల కిందట ప్రైవేటు ఆసుపత్రిలో థైరాయిడ్ నిర్ధారణ అయ్యింది. మందులు వాడుతున్నాను. ప్రభుత్వం ఆరోగ్య మహిళ పథకం ద్వారా థైరాయిడ్ చికిత్స అందిస్తారని చెప్పడంతో ఇక్కడికి వచ్చాను. రక్త పరీక్షలు చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. మందులు ఇస్తున్నారు. ఖర్చుల భారం తగ్గనుంది. – స్వప్న,హనుమాన్‌నగర్, కరీంనగర్

# పన్నుల చెల్లింపులో ఆదర్శం

కోరుట్ల: పంచాయతీ ప్రతి సంవత్సరం విధించే ఇంటి, కుళాయి, లైసెన్స్, ఇతర పన్నులు ప్రజలు సకాలంలో చెల్లిస్తేనే పంచాయతీ సిబ్బందికి నెలనెల వేతనాలు చెల్లించడంతోపాటు, ప్రజలకు మౌలిక వసతుల కల్పన సాధ్యమౌతుంది. వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య పనులు, సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు సజావుగా చేపట్టేందుకు వీలుంటుంది.. కోరుట్ల మండలంలో మొత్తం 15 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో జోగిన్‌పల్లి గ్రామంలో ప్రజలు వరుసగా 12 ఏళ్లుగా 100 శాతం వన్నులను మార్చి 31లోగా చెల్లించి గ్రామాభివృద్ధికి పాటుపడుతున్నారు. జోగిన్‌పల్లి గ్రామం జగిత్యాల జిల్లాలోనే 'ఆదర్శ' పంచాయతీగా పేరుగాంచింది. జోగిన్‌పల్లి గ్రామంలో మొత్తం 790 కుటుంబాలు, 3119 జనాభా ఉంటుంది. 2011-12 ఆర్థిక సంవత్సరం నుంచి 2022-23 వరకు వరుసగా పన్నెండేళ్లుగా శత శాతం పన్నులను ప్రజలు చెల్లిస్తున్నారు. 2011-12లో రూ.3,70,228, 2012-13లో రూ.3,48,682, 2013-14లో రూ.3,90,473, 2014-15లో రూ.4,06,906, 2015-16లో రూ.7,89,397, 2016-17 రూ.5,06,191, 2017-18లో రూ.5,61,561, 2018-19లో రూ.6,39,705, 2019-20లో రూ.5,95,429, 2020-21లో రూ.7,47,418, ప్రస్తుత 2021-22లో రూ.6,95,843, 2022-23లో రూ.7,71,507ల మొత్తం పన్నులను కడుతున్నారు.

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు

జోగిన్‌పల్లి పంచాయతీకి ప్రతి నెల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి



రూ.2.61 లక్షల నిధులు వస్తున్నాయి. వీటితోపాటు పంచాయతీకి వివిధ రకాల పన్నులు రూపంలో ఏడాదికి రూ.7 లక్షలకుపైగా నిధులు సమకూరుతాయి. ఈ నిధులతో వీధి దీపాల నిర్వహణ, సిబ్బంది వేతనాలు, పారిశుధ్య పనులు, మౌలిక వసతులు కల్పిస్తున్నారు. జడ్పీ అభివృద్ధి నిధులు రూ.5 లక్షలతో సీసీరోడ్డు, ఎన్ఆర్ఈజీఎస్ రూ.15 లక్షల నిధులతో సీసీరోడ్లను నిర్మించారు. శ్రీవేంకటేశ్వరస్వామి గుట్టకు రూ.28 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు. రూ.3.40 లక్షతో వైకుంఠ రథం ఏర్పాటు చేశారు. రూ.14 లక్షల నిధులను గ్రామస్థులు విరాళంగా అందజేయగా కల్యాణ మంటపం నిర్మించారు.

ప్రజల సహకారంతోనే సాధ్యమైంది

జోగిన్‌పల్లి గ్రామ ప్రజల సహకారం చాలా బాగుంది. 12 ఏళ్లుగా వందశాతం పనులు చెల్లించడంతో మౌలిక వసతుల కల్పన సులభం అవుతుంది. వందశాతం పన్నుల చెల్లింపుతో జిల్లాలోనే గుర్తింపు సాధించాం. పాలకవర్గ సభ్యులు, పంచాయతీ సిబ్బంది ప్రోత్సాహంతో అభివృద్ధిలో మండలంలోనే ముందంజలో ఉంచాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. దుంపాల నర్సు, జోగిన్‌పల్లి సర్పంచి

# ఆదాయం భళా.. వసతులు డీలా!

కరీంనగర్ : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రిజిస్ట్రేషన్ కార్యాలయాలు రాష్ట్ర ఖజానాకు కాసులు తెచ్చి పెడుతున్నాయి. భూముల క్రయవిక్రయాల నుంచి భారీగా ఆదాయం సమకూరుతుంది. రుణాలు తీసుకోని మార్టిగేజ్ చేసుకున్నా.. తిరిగి చెల్లించి మార్టిగేజ్ రీలిజ్ చేసుకున్నా ఆ డబ్బులు శాఖకే చెందుతాయి. గత ఆర్థిక సంవత్సరం 2022 ఏప్రిల్ 1వ తేదీ నుతంచి మార్చి 31వ తేదీ 2023 వరకు ఉమ్మడి జిల్లాలోని 13 కార్యాలయాల్లో మొత్తం 88,440 వివిధ రకాల ఆస్తులు రిజిస్ట్రేషన్లు కాగా వాటి ద్వారా రూ.311.72 కోట్ల ఆదాయం సమకూరింది. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ఉన్నతాధికారులు విఫలమవుతున్నారు.

వివిధ రకాలుగా..

జిల్లాలో రియల్ఎస్టేట్ వ్యాపారంతో రిజిస్ట్రేషన్ శాఖకు భారీగా ఆదాయం సమాకూరుతుంది. ప్రస్తుత మార్కెట్‌లో చాలామంది ఇందులో రాణిస్తున్నారు. స్థలాల క్రయవిక్రయాలతో జోరుగా సాగడంతో కాసులు వస్తున్నాయి. డబ్బులేని వారికి బ్యాంకు రుణాలు ఇప్పిస్తుండడం, పలు సంస్థలు పోటీపడుతుండడంతో చాలామంది స్థలాలు, భవనాలపై అప్పులు తీసుకొని ఇతర వ్యాపారాలకు పెట్టుబడి పెడుతున్నారు. వారు తీసుకున్న రుణంపై మార్టిగేజ్ ద్వారా ఆదాయం,



మొత్తం చెల్లించిన తర్వాత మార్టిగేజ్ రీలిజ్‌కు డబ్బు చెల్లించాల్సిందే. ఇలా ఏ లావాదేవీ నిర్వహించినా శాఖకు అదనపు ఆదాయమే.

తాగునీరు లేదు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 రిజిస్ట్రేషన్ కార్యాలయాలుండగా ప్రతి లావాదేవికి రిజిస్ట్రేషన్‌కు అమ్మినవారు కొన్న వారితోపాటు సాక్షులు రావాల్సి ఉండడంతో ఒక్క దస్తావేజుకు కనీసం ఆరుగురు వస్తుంటారు. వీరు కుర్చోవడానికి కుర్చీలు ఉండడం లేదు. తాగడానికి కనీసం మంచినీళ్లు కూడా లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిసార్లు ఆన్‌లైన్ సమస్యతో పని పూర్తయ్యే వరకు గంటల తరబడి నిల్చొనే ఉంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వసతులు కల్పిస్తాం

ప్రజలెవరైనా కొనుగోలు చేసిన ప్లాట్లను, ఇతర భూములను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఇలాగైతే వారికి భద్రత ఉంటుంది. కార్యాలయాలకు వచ్చే వారి కోసం కనీస సౌకర్యాలు కల్పిస్తాం.ప్రసూన, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిజిస్ట్రార్

# ప్రపంచ ఆర్థికాభివృద్ధి కేంద్రంగా భారత్: ప్రధాని మోదీ



దిల్లీ: దేశ ప్రజల శక్తి, నైపుణ్యాల కారణంగానే ప్రపంచ ఆర్థికాభివృద్ధిలో భారత్ మెరుగైన స్థానానికి చేరుకుంటోందని ప్రధాని మోదీ అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ 'వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్' పేరుతో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ దేశాల వృద్ధి రేటు అంచనాలను విడుదల చేసింది. ఇందులో భారత్ వృద్ధి రేటు అంచనా 6.3 శాతంగా ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఐఎంఎఫ్ అంచనాలను ఉద్దేశించి ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. " దేశ ప్రజల శక్తి, నైపుణ్యాల కారణంగానే అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధికి, ఆవిష్కరణలకు భారత్ కేంద్రంగా నిలుస్తోంది. సుసంపన్నమైన భారత్‌ను సాధించే దిశగా మన ప్రయాణాన్ని బలోపేతం చేస్తూ ముందుకు సాగుదాం. మన సంస్కరణలను మరింత పెంచుదాం" అని ప్రధాని ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇటీవల భారత్ వృద్ధి రేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 6.5 శాతంగా పేర్కొంది. దానికి 0.2 శాతం తగ్గించి 6.3గా ఐఎంఎఫ్ అంచనా వేసింది. గత జులైలో భారత్ వృద్ధి రేటును 6.1 శాతంగా ఐఎంఎఫ్ పేర్కొనడం గమనార్హం. ఈసారి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా వృద్ధి రేటు భారత్ కంటే తక్కువగా ఉంటుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఆ దేశంలో నెలకొన్న స్థిరాస్తి విపణి సంక్షోభం కారణంగా వృద్ధి రేటు అంచనాలను తగ్గించినట్లు ఐఎంఎఫ్ పేర్కొంది.

# పేదలకు విదేశీ విద్య పేరిట దోపిడీకి తెరతీసిన వైసీపీ సర్కార్



గుంటూరు: వైసీపీ ప్రభుత్వం పేదలకు విదేశీ విద్య పేరిట దోపిడీకి తెరతీసిందని జనసేన నేత నాదెండ్ల మనోహర్ విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. టోఫెల్ శిక్షణ పేరిట ఈటీఎస్ సంస్థకు ఏటా రూ.1040 కోట్లు దోచి పెట్టడానికి సిద్ధమైందన్నారు. ఏటా అమెరికా వీసా పొందే తెలుగు విద్యార్థులు 40 వేల మంది మాత్రమే అని.. కానీ ప్రభుత్వం లక్షలాది మందికి శిక్షణ ఇచ్చేది ఎందుకు అని ప్రశ్నించారు.

-జగనన్న విదేశీ విద్యా దీవెన కింద వైసీపీ ప్రభుత్వం కేవలం 340 మందిని మాత్రమే విదేశాలకు పంపించిందని తెలిపారు. నాలుగేళ్లుగా ప్రజల్ని మోసం చేసిన వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు బస్సు యాత్ర ద్వారా మరోసారి మోసానికి సిద్ధమైందని మండిపడ్డారు సీఎం హెలికాప్టర్లో తిరుగుతూ ఎస్సీ, ఎస్టీ , బీసి నేతలను బస్సుయాత్ర చేయాలని ఆదేశించారన్నారు. బస్సు యాత్రలో జగన్ రెడ్డి కూడా పాల్గొనాలని.. రాష్ట్రం లో రోడ్ల దుస్థితి ప్రత్యక్షంగా చూడాలని డిమాండ్ చేశారు. కేవలం ప్రతిపక్ష నేతలను విమర్శించడం కోసమే సీఎం పర్యటనలు అని నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యలు చేశారు.

# వ్యవసాయం, పౌరసరఫరాల శాఖలపై సీఎం సమీక్ష



తాడేపల్లి: వ్యవసాయం, పౌరసరఫరాల శాఖలపై ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సీఎం జగన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అధునాతన విధానాలను అవలంభిస్తూ అధిక దిగుబడులు సాధించేలా రైతులకు దిశా నిర్దేశం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఆశించినంత దిగుబడి వచ్చే విధంగా ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు రైతులకు సలహాలు ఇవ్వాలని సూచించారు.

-ఈ సమావేశంలో వ్యవసాయం, మార్కెటింగ్, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్ ఎం.వీ.యస్ నాగిరెడ్డి, వ్యవసాయశాఖ సలహాదారు తిరుపాల్ రెడ్డి, సీఎస్ డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ గోపాల కృష్ణ ద్వివేది, వ్యవసాయశాఖ స్పెషల్ కమిషనర్ సి.హరికిరణ్, ఉద్యానవన శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.ఎస్.శ్రీధర్, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ వీసీ అండ్ ఎండీ డాక్టర్ జి.శేఖర్ బాబు, పౌరసరఫరాలశాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్, ఏపీ స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ లిమిటెడ్ వీసీ అండ్ ఎండీ జి.వీరపాండియన్, పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ ఆర్. అమరేంద్రకుమార్, పౌరసరఫరాలశాఖ డైరెక్టర్ విజయ సునీత, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.




దిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీలో మార్పు చేసింది. నవంబర్ 23న జరగాల్సిన పోలింగ్ తేదీని నవంబర్ 25కి మారుస్తూ బుధవారం మధ్యాహ్నం ఓ ప్రకటన విడుదల చేసింది. తెలంగాణతో పాటు ఐదు రాష్ట్రాలకు అక్టోబర్ 9న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిప్రకారం.. రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నవంబర్ 23(గురువారం) జరగాల్సి ఉంది. ఇదేరోజు అక్కడ దేవ్ ఉథాని ఏకాదశి. దాంతో ఆ రాష్ట్రంలో 50వేల కంటే ఎక్కువ వివాహాలు జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. దాంతో మొత్తం 200 అసెంబ్లీ స్థానాల్లో ఓటింగ్ శాతం తగ్గిపోయే అవకాశం ఉందని భావిస్తున్నారు. రాజస్థానీలు దేవ్ ఉథాని ఏకాదశి రోజున వివాహాలు నిర్వహించుకోవడాని ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలోనే పోలింగ్ తేదీని మార్చాలంటూ పలు రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థల నుంచి ఈసీకి విజ్ఞప్తులు వచ్చాయి. అలాగే, రవాణా సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో పాటు ఓటర్లు పోలింగ్‌కు దూరమయ్యే అవకాశాలు ఉండొచ్చని.. అందువల్ల పోలింగ్ తేదీ మార్చాలంటూ మీడియా సంస్థల వేదికగా వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఈ మేరకు రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను నవంబర్ 25కి మార్పు చేస్తూ కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది.

# దుర్గగుడి నూతన ఈవోగా బాధ్యతలు చేపట్టిన కేఎస్ రామారావు



విజయవాడ: ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయ నూతన ఈవోగా కేఎస్ రామారావు బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఉదయం కనకదుర్గమ్మ సన్నిధిలో నూతన ఈవోగా రామారావు చార్జి తీసుకున్నారు. ఈ సందర్భంగా గత ఈఓ భ్రమరాంబకు గౌరవ మర్యాదలతో నూతన ఈవో వీడ్కోలు పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రామారావు మాట్లాడుతూ.. దసరా ఉత్సవాలు విజయవంతంగా నిర్వహిస్తామని తెలిపారు. గత ఈవో స్థిరమైన విధానాల వలన దసరా నిర్వహణ తేలికగా ఉంటుందని నూతన ఈఓ కేఎస్ రామారావు పేర్కొన్నారు. కాగా.. అక్టోబర్ 1న దుర్గగడి ఈవో భ్రమరాంబను బదిలీ చేసిన ప్రభుత్వం.. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఎం.శ్రీనివాస్‌ను ఈవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆయన విధుల్లో చేరకపోవడంతో కేఎస్ రామారావును దుర్గగుడి నూతన ఈవోగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తక్షణమే దుర్గగుడి ఈవోగా బాధ్యతలు చేపట్టాలని సర్కార్ ఆదేశించింది. శ్రీకాళహస్తి ఆర్డీవోగా పనిచేస్తోన్న కేఎస్ రామారావును దుర్గగుడి ఈవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.




# భారత్-కెనడా దౌత్య వివాదం.. విదేశాంగ మంత్రుల రహస్య భేటీ..!

ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య వెనుక భారత ఏజెంట్ల హస్తం ఉండొచ్చని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య దౌత్య వివాదం రాజుకున్న విషయం తెలిసిందే. ఈ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు భారత్, కెనడా విదేశాంగ మంత్రులు ఇటీవల అమెరికాలో రహస్యంగా భేటీ అయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఫైనాన్షియల్ టైమ్స్‌లో కథనం వెలువడింది. కొద్ది రోజుల క్రితం వాషింగ్టన్‌లో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్, కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ రహస్య సమావేశంలో పాల్గొన్నట్లు సదరు కథనం పేర్కొంది. భారత్‌తో దౌత్య ఉద్రిక్తతలను తొలగించుకోవాలని కెనడా ప్రయత్నిస్తున్నట్లు ఆ కథనం వెల్లడించింది. ఈ క్రమంలోనే దిల్లీ డిమాండ్ చేసినట్లుగా భారత్‌లో దౌత్యవేత్తల సంఖ్యను తగ్గించుకున్నట్లు తెలిపింది. అయితే, ఈ రహస్య భేటీ గురించి ఇరు దేశాల విదేశాంగ శాఖల నుంచి ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. భారత్‌తో దౌత్య వివాదాన్ని తాము ప్రైవేటుగా పరిష్కరించుకోవాలనుకుంటున్నామని ఇటీవల కెనడా విదేశాంగ మంత్రి మెలానీ ప్రకటించిన విషయం తెలిసిందే. "మేం భారత ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నాం. మా దౌత్యవేత్తల భద్రతకు మేం అత్యంత ప్రాధాన్యం ఇస్తాం. ఈ వివాదం పరిష్కారం కోసం ప్రైవేటు చర్చలు కొనసాగించాలనుకుంటున్నాం. ఎందుకంటే.. విషయాలు బహిర్గతం కానంతవరకు దౌత్యపరమైన చర్చలే ఉత్తమమైన మార్గమని మేం భావిస్తున్నాం" అని మెలానీ తెలిపారు. అటు, భారత్‌తో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితి ఇంకా పెరగాలని తమ దేశం కోరుకోవట్లేదని ట్రూడో కూడా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. నిజ్జర్ హత్యపై చేసిన వ్యాఖ్యలతో ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. కెనడా ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అంతేగాక, తమ అంతర్గత వ్యవహారాల్లో కెనడా దౌత్యవేత్తలు జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించింది. దౌత్యవేత్తల సంఖ్య విషయంలో కెనడా సమానత్వం పాటించాలని, భారత్‌లో వారి దౌత్య సిబ్బందిని తగ్గించుకోవాలని అల్టిమేటం జారీ చేసింది. ఈ క్రమంలోనే కెనడా దాదాపు 30 మంది దౌత్య సిబ్బందిని భారత్ నుంచి కౌలాలంపూర్/మలేసియా తరలించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి.




ఇజ్రాయెల్ దళాలు ఎట్టి పరిస్థితుల్లో హమాస్‌ను నామరూపాల్లేకుండా చేయాలని రగిలిపోతున్నాయి. ఈ సారి ఏకంగా ఆ ఉగ్రసంస్థ నాయకత్వంపైనే గురిపెట్టింది. ఈ క్రమంలో భాగంగానే ఇజ్రాయెలీ ఇంటెలిజెన్స్.. సైన్యం.. పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఇప్పటికే హమాస్ మాస్టర్ మైండ్ డెయిఫ్‌కు హెచ్చరికలు పంపాయి. అంతేకాదు.. ఆ సంస్థ కీలక నాయకత్వాన్ని ఒక్కొక్కరిగా మట్టుబెట్టడం మొదలుపెట్టాయి.

**టెర్రర్ నెస్ట్‌పై ఎడతెగని దాడులు..** : తాజాగా ఇజ్రాయెల్ వాయుసేన గాజా సమీపంలోని ఉగ్రవాదుల పుట్టగా భావించే 'అల్-ఫుర్కాన్' ప్రదేశంపై విరుచుకుపడింది. ఐడీఎఫ్ వాయుసేన ఏకంగా ఈ ఒక్క ప్రదేశంలోనే ఇప్పటికే పలు మార్లు దాడులు చేసింది. ఉగ్రగూడు ఫుర్కాన్‌పై దాడి చేశామంటూ ఐడీఎఫ్ ప్రత్యేకంగా వెల్లడించిందంటే హమాస్‌లో దాని ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ 200 దాడులు జరిగినట్లు 'ది జెరుసలెం పోస్టు' పేర్కొంది. ఇక్కడ ఓ ప్రార్థనా మందిరం వద్ద నుంచి హమాస్ రాకెట్ దాడులు చేస్తోందని పేర్కొంది. దీంతోపాటు రఫాలోని ఈజిప్ట్-గాజా సరిహద్దుల్లో ఆయుధ స్మగ్లింగ్ టన్నెల్‌ను ధ్వంసం చేసింది.

**ఈ ప్రదేశానికి ఎందుకు ఇంత ప్రాధాన్యం..** అల్-ఫుర్కాన్ ప్రదేశం గాజాకు అత్యంత సమీపంలో ఉంది. ఇక్కడి పాఠశాలలను వాడుకొని హమాస్ ఉగ్రవాదాన్ని ప్రచారం చేస్తోంది. ఇక్కడి పిల్లలను మానవ కవచాలుగా వాడుకొని తప్పించుకుంటోంది. ఈ విషయాన్ని 2022 డిసెంబర్ 14న ఇజ్రాయెల్ రక్షణ దళాల వెబ్‌సైట్ ఐడీఎఫ్.ఐఎల్ ప్రచురించిన నివేదికలో పేర్కొంది. గతంలో ఐరాస రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ నిర్మిస్తున్న ఓ స్కూల్ కుప్పకూలింది. ఈ స్కూల్ కింద హమాస్ అండర్‌గ్రౌండ్ టన్నెల్ నిర్మించడంతో ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. అంతేకాదు.. హమాస్ అల్-ఫుర్కాన్ ఎలిమెంటరీ స్కూల్ వద్దే రాకెట్ లాంఛింగ్ సైట్‌ను ఏర్పాటు చేసింది. ఇలా పలు స్కూళ్ల వద్ద రాకెట్ ప్రయోగ సైట్లను హమాస్ ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఈ పాఠశాలల్లో మొత్తం 1,000 మందికిపైగా పిల్లలు చదువుతున్నారు.

**ముఖ్య నేతలను టార్గెట్‌లో లాక్ చేసిన ఐడీఫ్..** హమాస్ కీలక నాయకులపై ఇజ్రాయెల్ దళాలు గురిపెట్టాయి. ఇప్పటికే హమాస్ ఆర్థిక మంత్రి జవద్ అబు షమలను హతమార్చాయి. గాజాపట్టీ లోపల, బయట అతడే ఉగ్ర నిధుల పంపిణీ వ్యవహారాలను పర్యవేక్షిస్తుంటాడని ఇజ్రాయెల్ పేర్కొంది. తమ వైమానిక దాడిలో అతడిని అంతం చేశామని పేర్కొంది. మరోవైపు హమాస్‌లో అత్యంత కీలకమైన పొలిట్ బ్యూరో సభ్యుడు, అంతర్జాతీయ విభాగం అధిపతి జకారియా అబు మమార్‌ను కూడా ఇజ్రాయెల్ దళాలు అంతం చేశాయి. వివిధ పాలస్తీనా గ్రూపులను సమన్వయం చేయడం మమార్ ముఖ్య విధి. అతడికి హమాస్ ముఖ్య నేత యాహ్యా సిన్వర్‌తో నేరుగా సంబంధాలున్నాయి. పలు దాడులకు ఆమోద ముద్రవేసే పొలిట్ బ్యూరోలో అతడు సభ్యుడు.

# ఏపీలో త్వరలో ఎన్నికలు!: మంత్రి అంబటి



గుంటూరు: ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని మంత్రి అంబటి రాంబాబు తెలిపారు.

ఎన్నికల్లో 175 స్థానాలు గెలుచుకోవాలన్న లక్ష్యంతో ఉన్నామని చెప్పారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ఈ నెల 26 నుంచి బస్సు యాత్ర చేస్తున్నాం. మళ్లీ జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం చేపట్టబోతున్నాం.

మాకు కక్షసాధింపులు అవసరం లేదు. ఎన్నికల ముందు కక్ష సాధింపు ఏంటి? ఆధారాలున్నాయి కాబట్టే చంద్రబాబును పోలీసులు అరెస్టు చేశారు" అని అంబటి వ్యాఖ్యానించారు.

# గన్నవరం ఎయిర్‌పోర్టులో వెన్నం జ్యోతి సురేఖ, కోనేరు హంపిలకు ఘన స్వాగతం

విజయవాడ : గోల్డ్ సిల్వర్ మెడల్స్ సాధించి ఢిల్లీ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెన్నం జ్యోతి సురేఖ, కోనేరు హంపిలు చేరుకున్నారు. గన్నవరం ఎయిర్‌పోర్టులో వెల్దాం జ్యోతి సురేఖకు డప్పు వాయిద్యాలతో క్రీడా సంఘాలు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా వెన్నం జ్యోతి సురేఖ మాట్లాడుతూ.. చైనాలో హాంగ్జువ్‌లో జరిగిన 19th ఏషియన్ గేమ్స్ లోఆర్చరీ(విలువిద్య) పోటీలలో వరుసగా మూడు గోల్డ్ మెడలో సాధించటం జరిగిందని తెలిపింది. అక్టోబర్ 1 నుంచి 7 వరకూ పోటీలు జరిగాయని వెల్లడించింది. మొట్టమొదటిసారిగా ఏషియన్ గేమ్స్‌లో ఒకేసారి మూడు మెడల్స్ రావడం చాలా సంతోషంగా ఉందని జ్యోతి సురేఖ తెలిపింది.

కోనేరు హంపి మాట్లాడుతూ... ఏషియన్ గేమ్స్‌లో ఉమెన్ ఛాంపియన్‌షిప్ లో సిల్వర్ మెడల్ సాధించానని తెలిపింది. మెన్, ఉమెన్ సెక్షన్ లో కూడా టీం మెడల్స్ వచ్చాయని పేర్కొంది. ఏషియన్ గేమ్స్‌లో భాగంగా అన్ని క్రీడా విభాగాలు కలిసి ఒకేసారి జరిగాయని తెలిపింది. మెన్, ఉమెన్ కేటగిరీలో ఏషియన్ గేమ్స్‌లో సిల్వర్ మెడల్స్ రావడం ఇదే మొదటిసారి అని కోనేరు హంపి వెల్లడించింది.





## పింక్ డిజైన్ లో సమంత పరిమళం

విశ్రాంతిలో భాగంగా సమంత అమెరికాలో ఉన్న సంగతి తెలిసిందే. ఏడాది పాటు సినిమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకుని లాంగ్ బ్రేక్ తీసుకుంది. అన్నీ రకాల సమస్యల నుంచి ఉపశమనం కోసమే ఇంత గ్యాప్ తీసుకుంటుంది. మనసుకు తగిలిన గాయాల నుంచి బయటపడిన అమ్మడు ఆ వెంటనే మయోసైటిస్ బారిన పడటం..కోలుకోవడం జరిగింది. కానీ అదంతా సినిమా షూటింగ్ లు చేస్తూ చేయాల్సి వచ్చింది. అందుకే లాంగ్ బ్రేక్ అంటూ అమెరికా చెక్కేసినా! అమ్మడు ఇన్ స్టా యాక్టివిటీ చూస్తే షాక్ అవ్వక తప్పదు. సొసగరి అమెరికా వెళ్లిన దగ్గర నుంచి కొత్త ఫోటోలతో ఇన్ స్టాని హీటెక్కిస్తుంది. అమెరికా అందాల్లో ఫోటోలు దిగుతూ వాటిని అభిమానులతో పంచుకుంటుంది. దీంతో ఆమె విశ్రాంతి కోసం



వెళ్లిందా? వెకేషన్ కోసం వెళ్లిందా? అన్న సందేహాలు తెరపైకి వచ్చాయి. కానీ ఇదొక మానసిక విరామం అన్నది సమంత అభిప్రాయం. అందుకే తనపై నెగిటివిటీ స్ప్రెడ్ అవుతున్నా వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు సాగిపోతుంది. తాజాగా సమంత ఇన్ స్టాలో మరో కొత్త ఫోటోని పోస్ట్ చేసింది. అందులో సమంత పింక్ వర్ణం డిజైన్ లో తళతళలాడిపోతుంది. కేన్స్ ఉత్సవాల్లో ర్యాంప్ వాక్ చేస్తున్నట్లు అమ్మడు అలా స్టైలిష్ గా నడుచుకుంటూ వస్తుండగా క్లిక్ మనిపించినా పిక్ లా ఉంది. సామ్ మెడలో డిజైన్డ్ నక్లెస్ నెక్ ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దింది. అమ్మడి మ్యాకప్..స్కిన్ టోన్ చూపరులను ఆకర్షిస్తుంది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది.

అభిమానులు లుక్స్ గార్జియస్...బ్యూటీఫుల్ అంటూ పొగిడేస్తున్నారు. మోడ్రన్ దుస్తుల్లోనే కాదు..సంప్రదాయ దుస్తుల్లోనూ కనిపించండి అంటూ కొంతమంది అభిమానులు కోరుతున్నారు. లాంగ్ బ్రేక్ తీసుకుంది కాబట్టి ఈ లోపు అన్ని రకాల దుస్తుల్లోనూ సామ్ మురిపించడం ఖాయం

## ఆ దేవుడిచ్చిన ఊహించని రంగుల జీవితం నాది!

ప్రియా వారియర్ కెరీర్ లో ఇప్పుడెంత బిజీగా ఉందో చెప్పాల్సిన పనిలేదు. సౌత్ సినిమాలు కూడా కాదు. ఏకంగా బాలీవుడ్ సినిమాలే చేస్తోంది. ప్రస్తుతం అమ్మడి లైనప్ లో చాలా సినిమాలున్నాయి. వచ్చిన ఏ అవకాశం విడిచిపెట్టలేదు. అలాగని సౌత్ ని లైట్ తీసుకోలేదు. ఇక్కడా అందివచ్చిన అవకాశాలు అందు కుంటుంది. కానీ అమ్మడి టార్గెట్ మాత్రం హిందీ ఇండస్ట్రీపైనే కనిపిస్తుంది. అక్కడ మార్కెట్ లో ఎలాగైనా నిలదొక్కుకోవాలని గట్టి ప్రయత్నాలు చేస్తోంది. మరి ఈరకమైన జీవితాన్ని ప్రియావారియర్ ఊహించిందా? అసలు తాన స్టార్ అవుతానని కలలోనైనా అనుకుందా? అంటే లేదనే చెప్పాలి. ఈ మాట స్వయంగా ప్రియావారియర్ చెప్పింది. 'చిన్న తనం నుంచి



సినిమాలంటే ఆసక్తి ఉంది. అదే ఇంట్రెస్ట్ తో సినిమా చూసొచ్చి అద్దం ముందు ప్రాక్టీస్ చేసేదాన్ని. కానీ నేను నటిని అవుతానని నా తల్లిదండ్రులే కాదు ..నేను కూడా ఊహించలేదు. చదువుకుంటోన్న సమయంలోనే ఆడిషన్ కి వెళ్లా. ఆ సినిమా పూర్తిచేయడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించారు' అంది. మలయాళ చిత్రం 'ఒరు ఆదార్ లవ్' లో అమ్మడు నటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా ఫ్లాప్ అయినా అందులో ట్రైలరే ప్రియా వారియర్ ని దేశ వ్యాప్తంగా పాపులర్ చేసింది. ఒక్క కన్ను గీటుతో యువతలో క్రేజీ భామగా మారిపోయింది. ఆ గీటుకు కుర్రాళ్లే కాదు...చాలా మంది సెలబ్రిటీ హీరోలు కూడా పిదా అయ్యారు. ఆ వీడియో నెట్టింట సంచలనం సృష్టించింది. ఆ వీడియోతోనే ప్రియా వారియర్ అంటే దే శవ్యాప్తంగా అందిరికీ తెలిసిందే. ఆ క్రేజ్ తోనే సినిమాల్లో అవకాశాలు రావడంతో నేడు రంగుల జీవితాన్ని ఆస్వాదిస్తుంది. కోట్లలో పారితోషికంగా తీసుకుంటుంది. ఖరీదైన కార్లు...అపార్ట్ మెంట్లు కొనుగోలు చేసింది. తాను ఏమాత్రం ఊహించని జీవితం తనకి దక్కింది. ఇలాంటి జీవితం ఉండాలంటే నిజంగా పెట్టి పుట్టాలి.




## ఫ్రైడే థియేటర్లలో బాక్సాఫీస్ సందడికి బ్రేక్




ప్రతి శుక్రవారం థియేటర్ల వద్ద ఉండే హంగామానే వేరు. కారణం నచ్చిన స్టార్ హీరో సినిమా సందడి చేస్తుంటే దాని కోసం థియేటర్ల వద్ద అభిమానులు చేసే హంగామా అంతా ఇంతా కాదు. బ్యానర్లు, స్క్రీన్ ముందు పేపర్ కటింగ్స్ చల్లెస్తూ థియేటర్ల వద్ద, లోపల ఓ పండగ వాతావరణం కనిపిస్తూ వుంటుంది. అయితే ఈ ఫ్రైడే బాక్సాఫీస్ వద్ద సందడికి బ్రేక్ పడబోతోంది. కారణం ఇప్పటి వరకు మీడియం రేంజ్ సినిమాలన్ని బాక్సాఫీస్ వద్ద హల్ చల్ చేశాయి. అయితే అందులో ఒకటి అర మాత్రమే సక్సెస్ అనిపించుకున్నాయి. గత వారం చాలా వరకు భారీ సినిమాల నుంచి మీడియం రేంజ్ సినిమాలు థియేటర్లలో సందడి చేశాయి. కానీ వాటన్నింటిలో సితార ఎంటర్ టైన్‌మెంట్ వారు నిర్మించిన 'మ్యాడ్' మాత్రమే సక్సెస్ అనిపించుకుని కాసుల వర్షం కురిపిస్తోంది. మూడు రోజులకు గానూ 'మ్యాడ్' వరల్డ్ వైడ్‌గా రూ. 8.4 కోట్ల గ్రాస్‌ని రాబట్టి ఆశ్చర్యపరిచింది. ఇదిలా ఉంటే వచ్చే శుక్రవారం ఎలాంటి సినిమాలు రాబోతున్నాయి?..ఏ రేంజ్‌లో సందడికి రెడీ అవుతున్నాయనే చర్చ మొదలైంది. అయితే ఈ ఫ్రైడే మాత్రం చెప్పుకోదగ్గ సినిమాలేవీ రావడం లేదు. ప్రేక్షకులకు పెద్దగా తెలియని వారు నటించిన సినిమాలే ఎక్కువగా ఈ శుక్రవారం థియేటర్లలోకి వచ్చేస్తున్నాయి. తంతిరం చాప్టర్ 1 టేల్స్ ఆఫ్ శివకాశి, మధురపూరి గ్రామం అనే నేను, రాక్షస కావ్యం, ప్రేమ యుద్ధం, ఒక్కడే 1 వెంకన్న ఆన్ డ్యూటీ వంటి సినిమాలు అక్టోబర్ 13 శుక్రవారం రిలీజ్ అవుతున్నాయి. ఇందులో ఏ సినిమాకు కూడా పెద్దగా బజ్ లేదు. అసలు రిలీజ్ అవుతున్నాయనే సమాచారం కూడా ప్రేక్షకుడికి లేదు. తరువాత వారం భారీ సినిమాలు బాక్సాఫీస్‌పై దండయాత్రకు రెడీ అవుతుండటంతో ఊరూ పేరూ లేని సినిమాలు ఈ శుక్రవారంని రిజర్వ్ చేసుకున్నాయి.

వీటితో పాటు హిందీ డబ్బింగ్ సినిమాలు కూడా పోటీపడుతున్నాయి. కానీ వాటి కోసం ప్రేక్షకులు థియేటర్లకు రావడం కష్టమే. ఇందులో తమిళ సినిమా కూడా ఉంది. జయం రవి, నయనతార నటించిన థ్రిల్లర్ 'గాడ్' కూడా వచ్చేస్తోంది కానీ దీనిపై కూడా ఎలాంటి బజ్ లేదు. వచ్చే వారం టైగర్ నాగేశ్వరరావు, భగవంత్ కేసరి, లియో, గణపథ్ వంటి భారీ క్రేజీ సినిమాలు రానుండటంతో ఈ శుక్రవారం ప్రేక్షకులు థియేటర్లకు రావడం కష్టమే అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. దీంతో బాక్సాఫీస్ సందడికి ఈ వారం బ్రేక్ పడినట్టేనని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.

## రొమాన్స్ లో పీసీనే శ్రుతిహాసన్ బీట్ చేస్తుందా?



టాలీవుడ్..కోలీవుడ్..బాలీవుడ్ లో అలరించిన శ్రుతిహాసన్ ఇప్పుడు హాలీవుడ్ లోనూ లాంచ్ అవుతోన్న సంగతి తెలిసిందే. అమ్మడు 'ది ఐ' చిత్రంతో తెరంగేట్రం చేస్తోంది. వైవిధ్యమైన పాత్రలు పోషించడం అంటే శ్రుతికి ఎంతో ఆసక్తి. ఈనేపథ్యంలో హాలీవుడ్ లోనూ అలాంటి అటెంప్ట్ చేస్తోంది. ఈ సైకలాజికల్ థ్రిల్లర్ లో శ్రుతి హాసన్ కి జోడీగా మార్క్ రౌలీ నటిస్తున్నారు. ఇందులో ఇద్దరు భార్యాభర్తల పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే శ్రుతి హాసన్ రోల్ ఎలా ఉంటుందన్నది రివీల్ అయింది. ఓ సాహసపేతమైన పాత్రలోనే కనిపిస్తుంది. చనిపోయిన భర్త అస్తికల్ని ఓ ద్వీపంలో కలిపేందుకు ఒంటరిగా ఆమె ఎలా ప్రయాణం చేసింది? భర్త మరణానికి కారణం ఎవరు? అనే తెలుసుకునే ప్రక్రియలో ఆమె ఎలాంటి అవరోధాలు ఎదుర్కొంది? అన్నది ఆసక్తికరం. ఇది శ్రుతిహాసన్ పాత్రకి సంబంధించి ఒకవైపు మాత్రం. నాణేనికి మరోవైపు అన్నట్లు శ్రుతి సినిమాలో రొమాంటిక్ సన్నివేశాల్లోనూ చెలరేగిందని టాక్. హీరోతో ఇంటిమేట్ సన్నివేశాల్లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రానే మించిపోయిందా? అంటే అవుననే ప్రచారం తెరపైకి వస్తోంది. శ్రుతిహాసన్ భార్యపాత్రని అత్యంత రొమాంటిక్ గానూ మలుస్తున్నట్లు సమాచారం. మార్క్ రౌలీతో అమ్మడు ఇంటిమేట్ సన్నివేశాల్లోనూ చెలరేగిందని కోలీవుడ్ లో గుసగుసలు మొదలయ్యాయి. భర్తతో బెడ్ రూమ్ సన్నివేశాలు రక్తికట్టించడంలో శ్రుతి హాసన్ ఏమాత్రం వెనకడుగు వేయలేదని టాక్ వినిపిస్తుంది. 'క్వాంటికో' సిరీస్ లో కదిలే కారులో పీసీ రొమాన్స్ చేస్తే ...శ్రుతి హాసన్ మాత్రం బెడ్ రూమ్ లోనే కావాల్సినంత రొమాన్స్ ని పండించిందని ప్రచారం సాగుతోంది. పాత్ర కోసం శ్రుతిహాసన్ పరిమితులు విధించే నటికాదు. పైగా ఇది హాలీవుడ్ సినిమా కాబట్టి సినిమాలో ఇంటిమేట్ సన్నివేశాలు తప్పనిసరని ఎలాగూ తెలుసు. అన్ని తెలిసిన శ్రుతి హాసన్ కొత్తగా నో చెప్పడానికి ఆస్కారం లేదని తెలుస్తుంది. మరి ఇందులో నిజమెంతో? ది ఐ రిలీజ్ తోనే క్లారిటీ వస్తుంది. ఈ చిత్రానికి డాఫ్నే ష్మోన్ దర్శకత్వం వహిస్తున్నాడు. దీంతో పాటు శ్రుతి హాసన్ తెలుగులో 'సలార్' లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. డిసెంబర్ లో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే నాని హీరోగా నటిస్తోన్న 'హాయ్ నాన్న'లోనూ నటిస్తోంది.

## ఎట్టకేలకు యుద్ధం నుంచి ఎస్కేప్ అయిన నటి

ఇస్లామిక్ తీవ్రవాద గ్రూప్ హమాస్ ఇజ్రాయెల్‌పై అక్టోబరు 07న మెరుపు దాడులతో ఆశ్చర్యపరిచింది. ఇజ్రాయెల్ గ్రామాలలోకి ప్రవేశించిన రాకెట్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో కనీసం 250మంది మరణించగా, 1500 మంది పైగా గాయపడ్డారని మీడియా నివేదిక అందింది. ఈ దాడుల్లో చాలా మంది ఇజ్రాయెల్ పౌరులను పాలస్తీనా ముష్కరులు బంధించారని కథనాలొచ్చాయి. అయితే ముష్కరుల ఆకస్మిక దాడిని ఇజ్రాయెల్ తిప్పి కొట్టింది. బందీలను తిరిగి గాజా స్ట్రిప్‌లోకి తీసుకువచ్చిందని మీడియాలో కథనాలొచ్చాయి. అయితే ఈ దాడుల సమయంలో బాలీవుడ్ నటి నుష్రత్ భరూచా యుద్ధ బాధిత ఇజ్రాయెల్‌లో చిక్కుకుపోవడం కలకలం రేపింది. హైఫా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు నుష్రత్ ఇటీవల ఇజ్రాయెల్ కి వెళ్లారు. అదే సమయంలో రాకెట్ దాడులు జరగ్గా తాను కూడా ఇతర ప్రజలతో పాటు నేలమాలిగ (అండర్ గ్రౌండ్) లోకి వెళ్లినట్టు నుస్రత్ వెల్లడించింది. యుద్ధ సమయంలో భయంభయంగా గడిపినట్టు ఆమె బంధుమిత్రులు సోషల్ మీడియాల్లో వెల్లడించారు. ఆ తర్వాత ఇజ్రాయెల్ లోని భారత రాయబార కార్యాలయం నుండి సహాయం అర్థించారు. అయితే శనివారం మధ్యాహ్నం నుంచి నుస్రత్ తో ఫోన్ కనెక్షన్ తెగిపోవడంతో



ఇండియాలో తన కుటుంబీకుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. వార్ జోన్ నుంచి విమానాశ్రయానికి వచ్చినా చాలా సేపు తను ఎక్కే విమానం కోసం వేచి చూసిందని కూడా తెలిసింది. చివరికి సహాయం పొందిన తరువాత నుష్రత్ అబుదాబి వయా కనెక్టింగ్ ఫ్లైట్ ద్వారా భారతదేశానికి తిరుగు పయనమైంది. తన ప్రయాణ దృశ్యాలు వైరల్ గా మారాయి. నుష్రత్ భారుచా బృందం తాజాగా ఒక ప్రకటన విడుదల చేసింది. మేము చివరకు నుష్రత్ కి దగ్గరగా రాగలిగాం. ఎంబసీ సహాయంతో ఆమెను సురక్షితంగా స్వదేశానికి తీసుకువస్తున్నాం. మాకు డైరెక్ట్ ఫ్లైట్ రాలేదు కాబట్టి నుస్రత్ కనెక్టింగ్ ఫ్లైట్‌లో ఉంది. ఆమె మరింత భద్రత కోసం మరిన్ని వివరాలను షేర్ చేయడం సాధ్యం కాదు.. కానీ భారతదేశంలోకి వచ్చిన వెంటనే మేము మీకు తెలియజేస్తాము. మేము ఉపశమనం పొందాము. నుస్రత్ సురక్షితంగా ఉన్నందుకు దేవునికి ధన్యవాదాలు" అని తెలిపారు. రాయిటర్స్ వివరాల ప్రకారం... పాలస్తీనా ఉగ్రమూకరుల దాడుల్లో కనీసం 250 మంది ఇజ్రాయిలీలు మరణించారు. 1500 మంది గాయపడినట్లు కథనాలొచ్చాయి. ప్రతీకార దాడులతో ఇజ్రాయెల్ ప్రతిస్పందించడంతో 230 మంది గాజన్లు కూడా మరణించారు. ఇజ్రాయెల్ తీరప్రాంత ఎన్‌క్లేవ్ లోపల భారీ వైమానిక దాడులతో ప్రతిస్పందించింది. ముష్కరులను చంపింది. వందలాది మంది ఈ యుద్ధంలో గాయపడ్డారు. ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు తమ ప్రజలను చంపినందుకు ప్రతీకారం తీర్చుకుంటామని, హమాస్‌ను శిథిలాలుగా మారుస్తామని అన్నారు.

## టైట్ బ్లాక్ ఔట్ ఫిట్ లో కన్నుల విందు

ఉత్తరాది ప్రేక్షకులను బుల్లి తెర ద్వారా మొదట ఎంటర్ టైన్ చేసిన మృణాల్ ఠాకూర్ అక్కడ నుంచి వెండి తెరపై అడుగు పెట్టింది. బుల్లి తెర నుంచి వెండి తెర పై అడుగు పెట్టినా కూడా అందాల ఆరబోత విషయంలో ఏమాత్రం తగ్గేది లేదు అన్నట్లుగా షో చేస్తూనే ఉంది. టాలీవుడ్ లో సీతారామం సినిమా తో అడుగు పెట్టింది. ప్రస్తుతం నానితో ఒక సినిమాను చేయడంతో పాటు సౌత్ లో పలు సినిమాలకు ఇప్పటికే సైన్ చేసింది. బాలీవుడ్ లో కూడా ఈమె వరుస సినిమాలతో జోష్ మీద ఉంది. ఒక వైపు సినిమాల్లో బిజీ బిజీగా నటిస్తూ ఆకట్టుకుంటూ ఉంది. మరో వైపు ఇలాంటి హాట్ ఫోటో షూట్స్ తో రెచ్చి పోతూ ఉంది. తాజాగా టైట్ బ్లాక్ డ్రెస్ లో కన్నుల



విందు చేసింది. సాధారణంగా వైట్ డ్రెస్ లో ముద్దుగుమ్మలు ఏంజిల్స్ మాదిరిగా ఉంటారు. బ్లాక్ డ్రెస్ చాలా కొద్ది మందికి మాత్రమే నప్పుతాయి. అలాంటిది మృణాల్ ఠాకూర్ కి బ్లాక్ డ్రెస్ అదిరింది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం మృణాల్ బ్లాక్ డ్రెస్ లో కన్నుల విందు చేస్తున్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. బ్లాక్ డ్రెస్ లో టాప్ లేపేసిన మృణాల్ ఠాకూర్ మ్యాడ్ ఫోజ్ లు ఇస్తూ అలరిస్తోంది. బ్లాక్ వెల్వెట్ డ్రెస్ లో ఈ అమ్మడు భలే ముచ్చటగా ఉందంటూ ఆమె ఫ్యాన్స్ తో పాటు అంతా కూడా కామెంట్స్ చేస్తున్నారు. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తే ముందు ముందు మరిన్ని సినిమాల్లో హాట్ పాత్రల్లో నటించే అవకాశాలు ఉన్నాయి.




హైదరాబాద్: తెలంగాణలో ఈ నెల 28న జరగాల్సిన సింగరేణి ఎన్నికలు వాయిదా పడ్డాయి.

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమ ఎన్నికలను వాయిదా వేయాలన్న సింగరేణి అభ్యర్థనకు హైకోర్టు అంగీకరం తెలిపింది. డిసెంబర్ 27న సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. నవంబర్ 30లోగా కార్మికశాఖకు తుది ఎన్నికల జాబితా సమర్పించాలని సింగరేణికి స్పష్టం చేసింది.

అలాగే సింగరేణి ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని హైకోర్టు ఆదేశించింది. ఎన్నికలకు సహకరిస్తామని రేపటిలోగా హామీ పత్రం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.



## రైతులకు త్వరలో గుడ్‌న్యూస్.. కిసాన్ సమ్మాన్ కింద మరో 2 వేలు!

దేశంలోని రైతులకు మోదీ సర్కారు గుడ్‌న్యూస్ చెప్పనుందా? గత సార్వత్రిక ఎన్నికల ముందు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం.. ఈ సారి ఆ మొత్తాన్ని పెంచనుందా? అంటే అవుననే అంటున్నాయి సంబంధిత వర్గాలు. వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు జరగనున్న వేళ రైతుల మనసు గెలుచుకునేందుకు మోదీ సారథ్యంలోని భాజపా సర్కారు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రస్తుతం ఇస్తున్న రూ.6 వేల మొత్తాన్ని రూ.8 వేలకు పెంచే అవకాశం ఉందని 'బ్లూమ్‌బెర్గ్' పేర్కొంది. ఒకవేళ రూ.2 వేలు చొప్పున రైతులకు అదనంగా చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయిస్తే ప్రభుత్వ ఖజానాపై రూ.20వేల కోట్ల మేర అదనపు భారం పడనుంది. దీనిపై ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధిని వివరణ కోరగా.. అందుకు నిరాకరించినట్లు బ్లూమ్‌బెర్గ్ తెలిపింది.

దేశంలో 140 కోట్ల మందిలో దాదాపు 65 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారని, భాజపా సర్కారు మూడోసారి అధికారంలోకి రావాలంటే వీరి ఓట్లు కీలకమని బ్లూమ్‌బెర్గ్ అభిప్రాయపడింది. దేశంలో ఇప్పటికీ మోదీనే పాపులర్ లీడర్ అయినప్పటికీ.. అసమానతలు, నిరుద్యోగం వంటి సమస్యలు సవాళ్లుగా మారనున్నాయని తెలిపింది.

గత సార్వత్రిక ఎన్నికల ముందు 2018లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని ప్రారంభించారు. మూడు విడతలుగా రూ.2 వేలు చొప్పున రైతులకు నేరుగా బ్యాంక్ అకౌంట్లలో ఈ నిధులు జమ అవుతున్నాయి. అయితే, నిధుల పెంపుపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. మరోవైపు ఎన్నికల వేళ ఉచిత రేషన్ పథకాన్ని మరోసారి పొడిగించే అవకాశం కూడా ఉందని తెలిసింది. దీంతో పాటు గృహ నిర్మాణానికి వడ్డీ రాయితీ పథకాన్ని కూడా త్వరలోనే ప్రకటించొచ్చని సమాచారం. ఇప్పటికే ఎల్పీజీ సిలిండర్ ధర తగ్గించడం, బియ్యం ఎగుమతులపై నిషేధం విధించడం వంటి చర్యలను ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేసింది.

## 17న సిద్దిపేటలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ.. ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట: రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగింది. ఇప్పటికే 115 మంది అభ్యర్థులను ఒకేసారి ప్రకటించిన బీఆర్ఎస్ విపక్షాలకు అందనంత దూరంలో నిలచింది. ఇక అసలు సిసలైన పోరాటాన్ని మొదలు పెడుతున్నది. ప్రత్యర్థులను చిత్తుచేసేలా రణగర్జన వినిపించబోతున్నది. అభివృద్ధే అస్త్రాలుగా సీఎం కేసీఆర్ ఎన్నికల సమరాంగణంలోకి అడుగుపెట్టనున్నారు. ఇప్పటికే ప్రచార వ్యూహాన్ని ఖరారుచేశారు. ఈ నెల 15న ఎన్నికల ప్రచార శంఖారావాన్ని పూరించనున్నారు. తొలి విడతలో భాగంగా 17 రోజుల్లో 42 నియోజకవర్గాలను చుట్టిరానున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 17న సిద్దిపేటలో ప్రచారం చేయనున్నారు. ప్రగతి-ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తారు. నేపథ్యంలో సభా స్థలిని మంత్రి హరీశ్ రావు పరిశీలించారు. అధికారులు సలహాలు, సూచనలు అందించారు. స్వరాష్ట్రంలో జరిగిన రెండు ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రచార పర్వాన్ని హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ప్రారంభించినట్టే ఈ సారీ అక్కడి నుంచే ప్రారంభించనున్నారు. తొలి విడతగా 17 రోజుల్లో 42 నియోజకవర్గాలను చుట్టే బాధ్యతను కేసీఆర్ నెత్తికెత్తుకున్నారు. 17 రోజుల షెడ్యూల్‌లో నవంబర్ 9న రెండు నియోజకవర్గాల్లో నామినేషన్లు దాఖలుచేసి సభల్లో పాల్గొంటారు. 15వ తేదీన హుస్నాబాద్ సభతో ప్రచారం జోరు మొదలు కానున్నది. 15 నుంచి 18వ తేదీ వరకు 5 నియోజకవర్గాల్లో సభలు నిర్వహిస్తారు. దసరా పండుగ తర్వాత 26 నుంచి తిరిగి ప్రచారం ప్రారంభిస్తారు.

## మేడారంలో మొక్కులు తీర్చుకున్న కిషన్‌రెడ్డి



వరంగల్(ములుగు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ములుగుకు గిరిజన యూనివర్సిటీ ఇచ్చినందుకుగానూ బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మేడారంలోని సమక్క సారక్క అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.."గిరిజన ఆరాధ్య దేవతలు సమ్మక్క సారలమ్మ ఆశీస్సులు తెలంగాణకు, దేశ ప్రజలకు ఉండాలని కోరుకుంటున్నాను. ములుగులో గిరిజన విశ్వ విద్యాలయాన్ని ఇవ్వడం మాములు విషయం కాదు. అమ్మవార్ల ఆశీస్సులు దేశంలో ఉన్న ప్రజలందరికీ ఉండాలి. ప్రాచిన దేవాలయం రామప్పకు యునెస్కో గుర్తింపు రావడం గొప్ప విషయం. హైదరాబాద్‌లో గిరిజనుల జీవన విధానాలను కళ్లకు కట్టినట్టు చూపించే విధంగా ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేస్తాం. ట్రైబల్ సర్క్యూట్ పేరుతో టూరిజం మినిస్ట్రీ ద్వారా పర్యాటక ప్రాంతాలైన రామప్ప, లక్నవరం, మేడారం, బొగత జలపాతం, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వంటి ప్రాంతాలను అభివృద్ధి చేస్తాం. బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్టీ రిజర్వేషన్ 10% అమలు చేస్తాం" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై రాజాసింగ్ ఏమన్నారంటే..?



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం నాడు ఆయన మాట్లాడుతూ.."బీజేపీ అసెంబ్లీ అభ్యర్థుల మొదటి జాబితాలో తన పేరు ఉంటుంది. లేకుంటే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటాను. బీజేపీ టికెట్ ఎవరికి వచ్చినా... నా మద్దతు ఉంటుంది. ఇతర పార్టీల మద్దతు లేకుండా బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే.. కేసీఆర్ ఏదో ఒక పార్టీ సపోర్టు తీసుకోవాల్సిందే. తనపై బీజేపీ పార్టీ విధించిన సస్పెన్షన్ ఎత్తివేస్తారన్న నమ్మకముంది. బీజేపీ జాతీయ, రాష్ట్ర నేతల మద్దతు నాకుంది. సస్పెన్షన్ ఎత్తివేయకుంటే ఇండిపెండెంట్‌గా పోటీ చేసే ప్రసక్తే లేదు. టికెట్ రాకపోతే హిందూ ధర్మం కోసం పనిచేసుకుంటాను" అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు.




ముంబయి: మహారాష్ట్రలోని నాందేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల మృత్యుఘోష కొనసాగుతోంది. ఇటీవల ఈ ఆసుపత్రిలో కేవలం 48 గంటల వ్యవధిలోనే 31 మంది మృతిచెందడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఇప్పుడు గడిచిన ఎనిమిది రోజుల్లో ఈ హాస్పిటల్‌లో మరో 108 మరణాలు సంభవించాయి. గత 24 గంటల్లోనే 11 మంది రోగులు మరణించగా.. వీరిలో ఓ పసికందు కూడా ఉండటం విచారకరం. అక్టోబరు నెల ఆరంభంలో ఈ ఆసుపత్రిలో 24 గంటల్లో 24 మంది మరణించిన విషయం తెలిసిందే. వారిలో 12 మంది శిశువులున్నారు. అయితే.. ఔషధాల కొరత, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే ఆసుప్రతిలో రోగులు మృతిచెందుతున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. వీటిని ఆసుపత్రి యాజమాన్యం తీవ్రంగా ఖండించింది. వారు అత్యంత విషమ పరిస్థితుల్లోనే తమ ఆసుపత్రికి వస్తున్నారని తెలిపింది. వీరిలో కొందరు పాముకాటుకు గురై ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. ఈ వరుస మరణాలపై తాజాగా ఆసుపత్రి డీన్ శ్యామ్ వాకోడే మరోసారి స్పందిస్తూ.. ఔషధాల కొరత ఆరోపణలను తోసిపుచ్చారు. "మా హాస్పిటల్‌లో ఔషధ నిల్వలు సరిపడా ఉన్నాయి. మేం మూడు నెలలకు సరిపడా మందులను అందుబాటులో ఉంచుతాం. సిబ్బంది కూడా రోగులకు అన్నివేళలా చికిత్స అందిస్తున్నారు. ఔషధాల కొరత కారణంగా ఏ రోగీ ప్రాణాలు కోల్పోవట్లేదు. వారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతోనే చనిపోతున్నారు. ఇక మరణించిన చిన్నారుల్లో కొంతమందికి పుట్టుకతో వచ్చిన ఆరోగ్య సమస్యలున్నాయి" అని తెలిపారు. నాందేడ్ ఆసుపత్రిలో నవజాత శిశువులు, రోగుల మృత్యువాత పడటం దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. ఈ ఘటనను బాంబే హైకోర్టు సుమోటోగా స్వీకరించింది.. మహారాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరింది. అటు జాతీయ మానవహక్కుల కమిషన్ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది.

## స్టాలిన్ కీలక ప్రకటన.. అగ్రి ఇన్‌స్టిట్యూట్‌కు స్వామినాథన్ పేరు



చెన్నై: తమిళనాడు అసెంబ్లీలో సీఎం ఎంకే స్టాలిన్ కీలక ప్రకటన చేశారు. తంజావూరులోని వ్యవసాయ కళాశాల, పరిశోధనా సంస్థకు ప్రఖ్యాత వ్యవసాయ శాస్త్రవేత్త, భారత హరితవిప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ పేరు పెడుతున్నట్టు తెలిపారు. అలాగే, తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్లాంట్ ప్రోపగేషన్, జెనిటిక్స్ విభాగాల్లో టాపర్లుగా నిలిచిన వారిని సత్కరించేందుకు స్వామినాథన్ పేరిట అవార్డును ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ.. తంజావూరులోని ఈచన్‌కోట్టైలో ఉన్న ఇన్‌స్టిట్యూట్‌ను డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ అగ్రికల్చరల్ కాలేజ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌గా మారుస్తామని ప్రకటించారు. పద్మవిభూషణ్, మెగసెసే అవార్డులతో పాటు అనేక జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలతో గౌరవం పొందిన స్వామినాథన్‌ను గౌరవించుకొనేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. 1960వ దశకంలో దేశంలో హరిత విప్లవానికి స్వామినాథన్ చేసిన కృషిని స్టాలిన్ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆ సందర్భంలో ఆయన చేసిన పనిని ప్రశంసించారు.

స్వామినాథన్ 1969లోనే వాతావరణ మార్పుల గురించి మాట్లాడారని ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. సెప్టెంబర్ 28న ఎం.ఎస్.స్వామినాథన్ చెన్నైలో కన్నుమూసిన విషయం తెలిసిందే.




పాక్ పాలు పోసి పెంచిన మరో ఉగ్రనాగు హతమైంది. పఠాన్‌కోట్ దాడి వ్యూహకర్తగా భావిస్తున్న జైషే మహ్మద్ టాప్ కమాండర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. తమ దేశంలో వరుసగా జరుగుతున్న పెంపుడు ఉగ్రవాదుల హత్యలు పాక్‌ను కలవరపెడుతున్నాయి. భారత్‌లోని పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై జరిగిన దాడి మాస్టర్‌మైండ్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది షాహిద్ లతీఫ్ హత్యకు గురయ్యాడు. పాకిస్థాన్‌లోని సియాల్‌కోట్‌లో బుధవారం అతడిపై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపి చంపేశారు. ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్‌కు లతీఫ్ లాంచింగ్ కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు. 2016 జనవరి 2వ తేదీన పంజాబ్‌లోని పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై భీకర ఉగ్రదాడి జరిగిన విషయం తెలిసిందే. దాదాపు 17 గంటల పాటు జరిగిన ఈ దాడిలో ఆరుగురు జవాన్లు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు.

ఈ ఘటన జరిగిన మరుసటి రోజు పఠాన్‌కోట్‌లో బాంబు పేలుడు జరిగి మరో అధికారి మరణించారు. ఈ దాడికి పాల్పడిన ఐదుగురు ముష్కరులను భారత భద్రతా సిబ్బంది మట్టుబెట్టారు. ఈ ఘటనకు సూత్రధారి షాహిద్ లతీఫ్ అని అప్పట్లో దర్యాప్తు సంస్థలు వెల్లడించాయి. పాక్ నుంచే అతడు ఈ దాడికి పథకం రచించినట్లు తెలిసింది. అతడే ఐదుగురు ముష్కరులను కోఆర్డినేట్ చేసి పఠాన్‌కోట్‌కు పంపినట్లు దర్యాప్తు నివేదికలు పేర్కొన్నాయి. దీంతో జాతీయ దర్యాప్తు సంస్థ అతడిని మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది. అయితే మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాదానికి సంబంధించిన కేసుల్లో లతీఫ్ 1994 నవంబరులో జమ్మూకశ్మీర్‌లో అరెస్టయ్యాడు. 16 ఏళ్ల పాటు భారత జైల్లో శిక్ష అనుభవించిన అతడిని 2010లో వాఘా సరిహద్దు వద్ద పాకిస్థాన్‌కు అప్పగించారు. కాగా.. 1999లో భారత విమానాన్ని హైజాక్ చేసి అఫ్గానిస్థాన్‌లోని కాందహార్‌కు తీసుకెళ్లిన ఘటనలో లతీఫ్ నిందితుడిగా ఉన్నాడు.

**ఐదో ఘటన..** ఇదిలా ఉండగా.. పాకిస్థాన్ వేదికగా ఉగ్ర కార్యకలాపాలు నిర్వహిస్తున్న టాప్ కమాండర్ ఇలా దుండగుల కాల్పుల్లో మరణించడం ఈ ఏడాది చోటుచేసుకున్న ఐదో ఘటన కావడం గమనార్హం. గత నెల పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో లష్కరే తోయిబా టాప్ కమాండర్ రియాజ్ అహ్మద్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ఈ ఏడాది మార్చిలో రావల్పిండిలో నిషేధిత హిజ్బుల్ ముజాహిదీన్ టాప్ కమాండర్ బషీర్ అహ్మద్ పీర్‌ను దుండగులు హత్య చేశారు. అంతకుముందు, ఈ ఏడాది ఫిబ్రవరిలో అల్ బదర్ ముజాహిదీన్ మాజీ కమాండర్ సయ్యద్ ఖాలిద్ రజాను కరాచీలో గుర్తుతెలియని వ్యక్తులు చంపేశారు. ఇక, ఇస్లామిక్ స్టేట్ టాప్ కమాండర్ అయిజాన్ అహ్మద్ అహంగర్ ఈ ఏడాది ఆరంభంలో అఫ్గాన్‌లో అనుమానాస్పద రీతిలో మరణించాడు.

## కాంగ్రెస్ నేతల మధ్య సయోధ్య కోసం.. జానారెడ్డికి కీలక బాధ్యతలు



హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు, నేతల మధ్య సయోధ్య కోసం మాజీ మంత్రి జానారెడ్డిని కాంగ్రెస్ హైకమాండ్ రంగంలోకి దింపింది. ట్రబుల్ షూటర్‌గా ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది. జానారెడ్డి ఆధ్వర్యంలో ఫోర్‌మెన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆయనతోపాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రే, దీపా దాస్ మున్షి, మీనాక్షి నటరాజన్‌లతో ఈ కమిటీని నియమించింది. ఎన్నికల్లో అభ్యర్థుల ప్రకటన తరువాత అసంతృప్తులను బుజ్జగించే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించినట్లు తెలుస్తోంది. ఇవాళ గాంధీభవన్‌లో జానారెడ్డి అధ్యక్షతన సమావేశమై అసంతృప్తులు ఉన్న నియోజకవర్గాలపై కమిటీ సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం.

## మంత్రి కేటీఆర్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

న్యూఢిల్లీ: మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై కేంద్ర ఎన్నికల సంఘానికి చార్టెడ్ అకౌంటెంట్, కాంగ్రెస్ నేత వేణుగోపాల స్వామి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీతో పాటు ఇతర పార్టీల నుంచి డబ్బులు తీసుకోవాల్సిందిగా కేటీఆర్ ప్రజల్ని ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ నేత లేఖ రాశారు.

ఏ పార్టీ నుంచి డబ్బు తీసుకున్నా సరే.. ఓటు మాత్రం బీఆర్ఎస్‌కు వేయాలని సూచిస్తున్నారని వెల్లడించారు. కేటీఆర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి వేణుగోపాల స్వామి వినతి చేశారు. మూడు రోజుల్లోగా చర్యలు తీసుకోకపోతే తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తానంటూ వేణుగోపాల స్వామి లేఖలో పేర్కొన్నారు.



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com